Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 101 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 23 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగింది

**- రాష్ట్రంలో 75 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు సంతృప్తి స్థాయిలో ఉన్నారు**

**- ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడి : రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలపై రాష్ట్ర ప్రజల్లో 75 శాతం మందికి పైగా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో వెల్లడైనట్లు రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఆర్టీజీఎస్ ద్వారా ప్రజల నాడి, ప్రభుత్వ సేవలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించడం జరుగుచున్నదని తెలిపారు. మిగిలిన 25 శాతం అసంతృప్తికి కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టనున్నామని, నూటికి నూరు శాతం కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఆర్టీజీఎస్ పనితీరుపై సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో ప్రజల సంతృప్త స్థాయి 75 శాతంకు పైగా ఉండటం తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారన్నారు. అయితే నూటికి నూరు శాతం సంతృప్త స్థాయి చేరేవరకు కృషి చేయాలని ఆయా శాఖాధిపతులను ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రజల అసంతృప్తికి కారణాలు తెలుసుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించడం జరిగిందన్నారు. మిగిలిన అసంతృప్తికి కారణాలు అధికారుల వైఫల్యమా, ప్రజా ప్రతినిధుల వైఫల్యమా తెలుసుకుని దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారని మంత్రి పార్థసారథి తెలిపారు. విద్యుత్ వినియోగంలో లో ఓల్టేజీ, విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. సబ్ స్టేషన్ ఒక యూనిట్‌గా తీసుకుని సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని, ప్రభుత్వం ఏర్పడి కేవలం ఏడాదిన్నర కాలంలోనే 34 క్యాబినెట్ సమావేశాలు, 26 ఎస్.ఐ.పి.బి. సమావేశాలను నిర్వహించి రాష్ట్రంలో బారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే అంశాలపై పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. దాదాపు రూ.7.65 కోట్ల పైబడి పెట్టుబడులు రాష్ట్రానికి రావడం జరిగిందని, తద్వారా 182 ప్రాజక్టుల్లో 7.21 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుచున్నదన్నారు. ఉచిత ఇసుక పాలసీ వల్ల ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం రాకపోయినా త్యాగం చేసి మరీ ఉచిత ఇసుక అందిస్తున్నామన్నారు. అలాగే హౌసింగ్ లో ఏ విషయంలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారో తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించిందని, హౌసింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించనున్నామన్నారు. వాట్సప్ గవర్నెన్స్ లో భాగంగా 741 సర్వీస్‌లు అందుబాటులోకి మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, కాని ప్రజలు ఆశించినంత స్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదని సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షలో గుర్తించారన్నారు. ఈ సేవలను యూజర్ ఫ్రెండ్లీగా రూపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అవేర్ సాఫ్ట్ వేర్ ద్వారా 42 సర్వీసులు ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 27 సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ముఖ్యంగా వేసవిలో వేడి గాలులు, వర్షాకాలంలో పిడుగులు పడే ప్రాంతాలు, భారీ వర్షాలపై ప్రజలను అప్రమత్తం చేసే మెసేజ్‌లు ప్రజలకు చేరవేయడంలో ముందున్నామన్నారు. తుఫాన్ ప్రభావంకు గురయ్యే ప్రాంతాలను సైతం ఖచ్చితత్వంతో కూడిన సమాచారం అందిస్తున్నామన్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రజలకు ఆ సేవలు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. డ్రోన్ పాలసీ రూపొందించిన తర్వాత రాష్ట్రంలో 2,10,047 గంటలకు పైగా డ్రోన్లను వినియోగించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సేవలకు 64,759 గంటలు, ప్రైవేట్ గా 1,45,288 గంటలు వినియోగించడం జరిగిందన్నారు. అలాగే పంట పోలాలకు పురుగు మందులు పిచికారి చేయడానికి లక్షన్నరకు పైగా గంటలు వినియోగించినట్లు వివరించారు. డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేయడం వలన ఎంత మేర ప్రయోజనం చేకూరిందన్న అంశంపై గణన జరుగుతుందన్నారు. డ్రోన్ల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నూల్ లో తయారైన డ్రోన్లు ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించామని, వాటి పనితీరు భేష్ అని సాక్షాత్తు ప్రధాని మోదీ మెచ్చుకున్న విషయం ఈ సందర్భంగా గుర్తుచేశారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్బన్ ప్రాంతాల్లో 50 వేల ఇళ్లను ఇప్పటికే మంజూరు చేయడం జరిగిందని, మరిన్ని దరఖాస్తులు వస్తే ఇంకా మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గృహాలు లేనివారు నవంబర్ 5 లోపు అర్బన్ హౌసింగ్‌కు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పార్థసారథి కోరారు.



**యం ఏ యు డి ఉద్యోగుల కార్యాలయ భవనాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలం సీడ్ యాక్సిస్ రోడ్ - లింగాయపాలెం జంక్షన్ ప్రాంతం రాజధాని అమరావతిలో నిర్మాణం జరుగుతోంది.**

**ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్**

## రాష్ట్రపతికి తప్పిన ప్రమాదం



**తిరువనంతపురం :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రమాదం తప్పింది. బుధవారం ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కేరళలో కొచ్చిలోని ప్రమాదం స్టేడియంలో ల్యాండింగ్ అయింది. ఆ సమయంలో ఈ హెలికాప్టర్ ఒక వైపునకు భూమిలోకి కూరుకుపోయింది. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. వారంతా కలిసి ఒరిగిపోయిన హెలికాప్టర్‌ను సరి చేశారు. దీంతో భద్రతా సిబ్బంది సాయంతో ముర్ము.. హెలికాప్టర్ నుంచి కిందకి దిగారు. అయితే ఈ ఘటనపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

**కేరళలో పర్యటన కోసం..**

నాలుగు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం కేరళ రాజధాని తిరువనంతపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు ఆ రాష్ట్ర గవర్నర్, సీఎంతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. అయితే ఈ పర్యటనలో భాగంగా శబరిమల, శివగిరిలోని దేవాలయాలను రాష్ట్రపతి ముర్ము సందర్శిం చుకోని.. ప్రత్యేక పూజలు చేయనున్నారు. అలాగే రాజ్‌భవన్‌లో మాజీ రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. పాలలో సెయింట్ థామస్ కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ఆమె పాల్గొంటారు. అదే విధంగా ఎర్నాకుళంలోని సెయింట్ థెరిసా కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో సైతం రాష్ట్రపతి పాల్గొనున్నారు. ఇక ఈ రోజు షెడ్యూల్ ప్రకారం.. రాష్ట్రప్రతి ముర్ము పర్యటన వివరాలు.. బుధవారం ఉదయం 9.25 గంటలకు హెలికాప్టర్‌లో నీలక్కల్‌కు బయలుదేరి 11.50 గంటలకు శబరిమల చేరుకుంటారు. శబరిమలలో కొలువు తీరిన అయ్యప్ప స్వామి వారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడి అతిథి గృహానికి చేరుకుని భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత సాయంత్రం 4.20 గంటలకు శబరిమల నుంచి బయలుదేరి తిరువనంతపురంకు చేరుకుని.. రాజ్‌భవన్‌కు వెళ్తారు. మరోవైపు రాష్ట్రపతి పర్యటన సందర్భంగా శబరిమలలో భారీగా ఆంక్షలు విధించారు. అలాగే అత్యధిక సంఖ్యలో పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు.

## ఏపీ–యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేందుకు సహకరించండి

**- షిప్ బిల్డింగ్ నుంచి డేటా సెంటర్ల వరకు ఏపీలో అపారమైన అవకాశాలు - యూఏఈలోని తెలుగువారి అభివృద్ధికి తోడ్పాటు అందించండి - మోదీ చొరవతోనే దేశంలో విప్లవాత్మక మార్పులు - దుబాయ్‌లోని భారత ఎంబసీ ప్రతినిధులతో జరిగిన భేటీలో సీఎం చంద్రబాబు**

**దుబాయ్ :** ఆంధ్రప్రదేశ్–యూఏఈ మధ్య పారిశ్రామిక బంధం బలపడేలా సహకరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయిలోని భారత రాయబార కార్యాలయం ప్రతినిధులను కోరారు. పెట్టుబడుల సాధనకు, నవంబర్ నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానాలు పలికేందుకు యూఏఈలో మూడు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం సీఎం చంద్రబాబు దుబాయ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా దుబాయ్, అబుదాబి దేశాల్లో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులతో సీఎం భేటీ అయ్యారు. దుబాయ్ ఇండియన్ కాన్సుల్ జనరల్ సతీష్ కుమార్ శివన్, అబుదాబిలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ అమర్నాథ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. దుబాయ్ సహా యూఏఈ దేశాల్లోని వివిధ కంపెనీల వివరాలు, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉంటుందనే అంశాలపై వారితో చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, పెట్రో కెమికల్స్, పోర్టులు, లాజిస్టిక్స్, ఏవియేషన్, ఇండస్ట్రియల్ పార్కులు, రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు, ఆతిథ్య రంగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా ఏపీలో వనరులు, అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. గూగుల్ సంస్థ విశాఖలో అతిపెద్ద డేటా ఏఐ హబ్ 15 బిలియన్ డాలర్లతో పెట్టుబడులు పెడుతోందని సీఎం వారికి వివరించారు. ఏపీకి 1054 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరప్రాంతంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, హార్బర్లను అభివృద్ధి



చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం వివరించారు. యూఏఈ దేశాల సావరీన్ ఫండ్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపైనా వారితో ముఖ్యమంత్రి చర్చించారు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అనుమతులు ఇస్తోందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐతో కలిసి భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నామని... యూఏఈలోని వివిధ సంస్థలను ఆ సదస్సుకు ఆహ్వానిస్తున్నామని దుబాయిలోని భారత ఎంబసీ ప్రతినిధులకు సీఎం తెలిపారు. ప్రధాని మోదీ చొరవ వల్లే దేశంలో చాలా మార్పులు వచ్చాయని.. భారత్ ను పెద్ద ఎత్తున ఆయన ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు పెరగడానికి ప్రధాని చేస్తున్న కృషే కారణమని ముఖ్యమంత్రి తెలిపారు.

## తునిలో మైనర్ బాలికపై అత్యాచారయత్న ఘటనపై "మహిళా కమిషన్" సీరియస్

**- ఆ కీచకుడి భరతం పట్టండి - కాకినాడ ఎస్పీని కోరిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ - బాలికల భద్రతకు విరుద్ధంగా పనిచేస్తే ఏ స్థాయివారైనా వదలొద్దంటూ ఆదేశాలు**

**అమరావతి, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా తునిలో మైనర్ గురుకుల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్న ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బంధువునంటూ విద్యార్థినిని పాఠశాల నుంచి తోటల్లోకి తీసుకెళ్లి వేధించిన కీచకుడి ఉదంతం బుధవారం సోషల్ మీడియాలో దుమారం రేగింది. దీనిపై తక్షణమే స్పందించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ కీచకుడి భరతం పట్టాలని కోరారు. ఈ ఉదంతంపై కమిషన్ సుమోటోగా కేసును స్వీకరిస్తున్నట్లు కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ చెప్పారు. కేసు దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, నిందితుడిపై పోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ బాలికలపై ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడిన ఏ స్థాయి వారైనా వదలకుండా కఠినంగా శిక్షించాల్సిందేనని చెప్పారు. బాధిత బాలికకు తక్షణ రక్షణ, వైద్య సహాయం, చట్టపరమైన మద్దతు అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి నివేదికను 48 గంటల్లోగా కమిషన్‌కు సమర్పించాలంటూ జిల్లా పోలీసు శాఖకు నోటీసు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గురుకుల పాఠశాలల్లో భద్రతా చర్యలను కఠినతరం చేయాలని రాష్ట్ర విద్యాశాఖకు లేఖల ద్వారా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాయపాటి శైలజ మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు విరుద్ధమైన ఏ చర్యలైనా కమిషన్ సహించదని, నిందితులకు కఠినమైన శిక్ష విధించేలా న్యాయ ప్రక్రియను పర్యవేక్షిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# అర్హులందరికీ అక్రిడేషన్లు ఇస్తాం

## - సమాచార శాఖ సంచాలకులను కలిసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు - హామీ ఇచ్చిన సంచాలకులు విశ్వనాథన్

**విజయవాడ, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ కొత్త అక్రిడేషన్లు ఇస్తామని సమాచార శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ హామీ ఇచ్చారు ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సమాచార శాఖ కమిషనర్ కేఎస్ విశ్వనాథాన్ని ప్రతినిధుల బృందం కలిసి జర్నలిస్టుల సమస్యలు కొత్త అక్రిడేషన్ల అంశాలను సుదీర్ఘంగా సంచాలకులతో చర్చించారు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐ వి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్,ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ, ఉపాధ్యక్షులు చావా రవిల ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సమాచార శాఖ సంచాలకులను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని, దీనికి ఇటీవల జారీ చేసిన జీవో ప్రకారం రాష్ట్ర, జిల్లా స్థాయిలో అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేసి వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్న జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ, ప్రొఫెషనల్ ఎథిక్స్ కమిటీ, వెల్ఫేర్ ఫండ్ కమిటీ వంటి వివిధ జర్నలిస్ట్ ప్రొఫెషనల్ కమిటీలను తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు వాటిల్లో గతంలో మాదిరిగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులను, ఆయా కమిటీల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో స్థాపించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ పథకాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.



పాత్రికేయులు, యాజమాన్యాల భాగస్వామ్యంతో పత్రికలకు మీడియా సంస్థలకు ప్రభుత్వం జారీ చేసే ప్రకటన బిల్లుల నుండి ఐదు శాతం మినహాయించి జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్కు జమచేసి బలోపేతం చేయాలని కోరారు. ఇబ్బందుల్లో ఉన్న పాత్రికేయులను ఆదుకునేందుకు వ్యవస్థను గతంలో మాదిరిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ను పటిష్టం చేసి అవసరమైన బడ్జెట్లు కేటాయించాలని కోరారు. అకాడమీ నియమావళి ప్రకారం వివిధ కార్యకలాపాలు చేపట్టడానికి వీలుగా గవర్నింగ్ కౌన్సిల్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో నియమించాలని విన్నవించారు. వృత్తిలో ప్రతిభ కనబరిచిన పాత్రికేయులకు, ఫోటో జర్నలిస్టులను, ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందిని ప్రోత్సహించేందుకు వీలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేసి ఈమధ్య నిలిపివేసిన రాష్ట్రస్థాయి ఉత్తమ జర్నలిస్టు పురస్కార ప్రధాన కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు .అలాగే సుదీర్ఘకాలం వృత్తిలో సేవలు అందించిన సీనియర్ పాత్రికేయులను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించే ఆనవాయితీని తిరిగి ప్రారంభించాలని కోరారు .పాత్రికే వృత్తిలో శిక్షణ నైపుణ్యం పెంపొందించుకోవడానికి వీలుగా ఉన్నత విద్యాభ్యాసానికి వృత్తి పరికరాలు కొనుగోలు చేసుకోవడానికి తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయాలని సంచాలకులను విజ్ఞప్తి చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ కార్డుల పథకాన్ని పటిష్టంగా అమలు చేయడానికి, పథకం అమలను పర్యవేక్షించడానికి వీలుగా సమాచార శాఖ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షగా కమిటీని నియమించాలని సూచించారు. 2016లో ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేసి గత ప్రభుత్వం నిలిపివేసిన వర్కింగ్ జర్నలిస్ట్ ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్ట్ కేటగిరీల సిబ్బందికి వేజ్ బోర్డు సిఫారసుల ప్రకారం వేతనాలు అమలు చేయడానికి వీలుగా కార్మిక శాఖ ద్వారా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. వేజ్ బోర్డు సిఫార్సులు పర్యవేక్షించడానికి చట్ట ప్రకారం గతంలో మాదిరిగా త్రైపాక్షగా కమిటీలను ఏర్పాటు చేయాలని సంచాలకులను కోరారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపైన, మీడియా సంస్థలపైన దాడులు అరికట్టడానికి మహారాష్ట్ర తరహాలో మన రాష్ట్రంలో కూడా ఒక ప్రత్యేక చట్టాన్ని తేవాలని విన్నవించారు. కరోనాకాలంలో రద్దయిన జర్నలిస్టుల రైల్వే రాయితీ ప్రయాణ సదుపాయాన్ని పునరుద్ధరించదానికి కేంద్రంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికల మనుగడ కొనసాగటానికి వీలుగా ఆయా సంస్థలకు రొటేషన్ పద్ధతి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రచార ప్రకటనలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా వయోభారంతో వృత్తి నుండి విరమించుకున్న వయోధిక పాత్రికేయులకు పింఛన్ సదుపాయాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అక్రిడే షన్తో నిమిత్తం లేకుండా సీనియార్టీ ప్రాతిపదికన పనిచేస్తున్న పాత్రికేయులు అందరికీ అదే విధంగా ఇటీవల వృత్తి నుండి విరమణ చేసిన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు, అదే విధంగా కేటాయింపులు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనేతర పాత్రికేయులకు సమీప మైదాన ప్రాంతాల్లో స్థలాలు కేటాయించాలని అందుకని జారీ చేసిన ఇళ్ల స్థలాల జీవాలను సవరించాలని సమాచార శాఖ సంచాలకులకు విజ్ఞప్తి చేశారు. వీటిపై సమాచార శాఖ సంచాలకులు విశ్వనాథం సానుకూలంగా స్పందించారు వీటిపై తక్షణమే సమావేశాలు నిర్వహించి అందరికీ అనుగుణమైన నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సెక్రటరీ దాసరి నాగరాజు ఏపీడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంబాబు స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఏడుకొండలు తదితర నాయకులు హాజరయ్యారు.

# మీది చీకటి పాలన జగన్ - వెలుగు గురించి మాట్లాడే హక్కు నీక్కెక్కడిది! - నిప్పులు చెరిగిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** గత వైకాపా పాలనలో రాష్ట్ర ప్రజలకు నరకమెంటో ప్రత్యక్షంగా చూపి, చీకటి పాలన అందించిన జగన్రెడ్డి కూటమి ప్రభుత్వ హయాంలో వెలుగులు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. ఇప్పటికీ గత వైకాపా చీకటి పాలన గురించి తలుచుకొని ప్రజలు వణికిపోతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో వైకాపా హయాంలో ప్రతి ఇంటిని కమ్మేసిన చీకటిని ఎన్డీఏ ప్రభుత్వం తరిమేసి, వెలుగులు నింపుతుండగా జగన్ జీర్ణించుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లు మాత్రమే దక్కి.ఇంటికి పరిమితమైన జగన్ కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వెలగని దీపాలుగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటనలు చేస్తుండడం ఆయన అవివేకానికి నిదర్శమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం జైల్లో నాలుగు గోడల మధ్య చీకట్లో మగ్గి బయటకొచ్చిన జగన్ వెలుగును చూసి ఇప్పటికీ తట్టుకోలేక...పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని మంత్రి సత్యకుమార్ బుధవారం విడుదలచేసిన ప్రకటనలో నిప్పులు చెరిగారు. మూడు రాజధానుల పేరుతో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయగా.. ప్రస్తుత సీఎం చంద్రబాబు వికేంద్రీకరణ విధానంతో అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం పునర్నిర్మాణం దిశగా వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు.

**వెల్లువలా పెట్టుబడులు.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు!**

“2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనకు కృషి జరుగుతోంది. ఈ సంకల్పానికి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం మరింత శక్తినిస్తుంది. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దార్శనికతతో రాష్ట్రం సరికొత్త శక్తిగా అవతరించబోతుంది. డబుల్ ఇంజన్ సర్కారు కృషితో రాష్ట్రానికి రూ. 11 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయి. ఐదారు లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. పోలవరానికి రూ. 12,500 కోట్లు, అమరావతికి రూ. 15వేల కోట్లు, విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ. 11,450 కోట్లు, నేషనల్ హైవేకు రూ. 70వేల కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ. 70వేల కోట్లు, కొపర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్లకు రూ.వేల కోట్ల నిధులు కేంద్రం నుంచి వస్తున్నాయి. గూగుల్ సంస అమెరికా వెలుపల తొలిసారిగా దేశంలోనే విశాఖలో కృత్రిమ మేధ హబ్ ఏర్పాటు చేయబోతుంది.

**ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు**

ఎన్డీఏ ప్రభుత్వ సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయి. తల్లికి వందనం, స్త్రీ శక్తి, మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, దీపం-2 అమలు వంటి సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఇంటికి చేరుతున్నాయి. నాటి జగన్ పాలనలో వైద్య రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. కూటమి ప్రభుత్వం వైద్య సేవలు మెరుగుపరుస్తున్నందున ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ, ఐపీ సేవలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పించబోతుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వైద్య ఆరోగ్య శాఖ పనితీరును ప్రశంసించి, కేంద్రం రూ. 100 కోట్లను ప్రోత్సాహకరంగా అందచేసింది.

**జగన్ పాలన విధ్వంసంతోనే ప్రారంభం**

నాటి జగన్ పాలన ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభమైంది. రాజధాని అమరావతి అభివృద్ధిని జగన్ తొక్కేశారు. పోలవరం ప్రాజెక్టు అమలును నీరుగార్చారు. గత వైకాపా హయాంలో జరిగిన డీబీటీ మోసాలు అన్నీ ఇన్నీ కావు. బోధనా రుసుముల చెల్లింపుల విధానాన్ని అస్తవ్యస్తంచేశారు. దశలవారీ మద్య నిషేధ హామీని అటకెక్కించారు. నకిలీ మద్యం విక్రయాలతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారు. మద్యం విక్రయాల్లో సరికొత్త దోపిడీకి తెరదీశారు.’ అని సత్యకుమార్ ధ్వజమెత్తారు.

# వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం మంజూరు

## - కిడ్నీ రోగులకు తీపి కబురు : ఎమ్మెల్యే కురగొండ్ల

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** కిడ్నీ సమస్యలతో బాధ పడుతున్న రోగు లకు ఊరటనిచ్చే వార్త. వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం మం జూరైంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ మం గళవారం మీడియాతో వెల్లడించారు. ఇటీవలి కాలంలో వెంకట గిరిలో డయాలసిస్ సెంటర్ అవసరాన్ని గుర్తించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఈమేరకు అధికారికంగా ప్రకటన చేసినట్టు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన విన్నపాన్ని వెంటనే పరిగణనలోకి తీసుకుని కేంద్రం మంజూరు చేయడంతో, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. “వెంకటగిరిలో డయాలసిస్ సౌకర్యం లేకపోవడంతో చాలా మంది రోగులు నెల్లూరు, తిరుపతి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కానుండటంతో స్థానిక ప్రజలకు గణనీయమైన ఉపయోగం కలుగుతుంది,” అని ఎమ్మెల్యే అన్నారు. త్వరలోనే కేంద్రానికి అవసరమైన యంత్రాలు, సిబ్బంది ఏర్పాటు చేసి సేవలు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.



# ఐఐఎస్ఇఆర్లో ఘనంగా ‘స్వచ్ఛోత్సవ్

## - సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**తిరుపతి, (రాజధాని వార్తలు):** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) ఆధ్వర్యంలో బుధవారం ‘స్వచ్ఛోత్సవ్’ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుపతిలోని భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధన సంస్థ ఐఐఎస్ఇఆర్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బందికి స్వచ్ఛతే సేవ-2025 కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ రమేష్ చంద్ర మాట్లాడుతూ, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణ సవాళ్లకు ఐఐఎస్ఇఆర్ విద్యార్థులు, శాస్త్రవేత్తలు వినూత్న పరిష్కారాలు కనుగొనాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న ప్రజా అలవాట్లతో దేశం ఎదుర్కొనే పారిశుధ్య, పర్యావరణ సమస్యల పరిష్కారమే మానవాళి మనుగడకు కీలకమని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ అభియాన్ 2014లో ప్రారంభించిన నాటినుంచి గ్రామాలలో, పట్టణాలలో స్వచ్ఛత పట్ల సమాజంలో పెరిగిన అవగాహన సానుకూల ఫలితాలనిస్తున్నదని రమేష్ చంద్ర వివరించారు. ఆరు లక్షలకు పైగా గ్రామాలు బహిరంగ మలవిసర్జన నుంచి బయటపడగా, దేశంలో 85 శాతానికి పైగా గృహాలలో మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని, తద్వారా ఆరోగ్య, ఆర్థిక సూచికల్లో భారత్ పైకి చేరుతున్నదని తెలిపారు. దేశాన్ని 2047 కల్లా వికసిత భారత దేశంగా ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి ప్రతి పౌరుడు పరిశుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించి, ‘పరిశుభ్రతే సేవ’ అనే సందేశాన్ని ఇవ్వడమే స్వచ్ఛతా హి సేవ ముఖ్య ఉద్దేశమని రమేష్ చంద్ర తెలిపారు. భారతీయ విజ్ఞాన శిక్షణ మరియు పరిశోధన సంస్థ తిరుపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హుస్సేన్ భుక్య మాట్లాడుతూ, కళాశాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్లాస్టిక్ రహిత కళాశాలగా మార్చడంలో ముందడుగు వేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ రిజిస్ట్రార్ కుమార్ హిమాన్షు శేఖర్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించేందుకు కళాశాల ఆవరణలో మొక్కలు పెంచుతున్నామని అందులో భాగంగా అమ్మ పేరిట ఒక్క మొక్క అనే కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి మొక్కలు యొక్క ప్రాముఖ్యతను తెలిపారు. స్వచ్ఛతే సేవ ఇతివృత్తంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అందరూ స్వచ్ఛతకు కట్టుబడి ఉంటామని స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# కాకివాయిలో 100 ఎకరాలు నీట మునిగిన వరి పంట

**చేజర్ల, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా చేజర్ల మండలం =లోని కాకివాయి గ్రామంలో గడిచిన ఐదు రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో ఆ గ్రామంలో సుమారు 100 ఎకరాలు వరి పంట నీట మునిగింది. వరి పంట నీటమునగడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. చేతికి వచ్చిన పంట ఇంటికి చేరే సమయానికి కురుస్తున్న వర్షాలు ఇంకా అధికమవుతుండడంతో పంట మొత్తం నేల పాలైయింది. తిరిగి గింజలు నీటిలో మొలకెత్తుతున్నాయని అన్నారు. తమ పంట మొత్తం నేలపాలయ్యిందని మమ్ములను ఆదుకోవాలంటూ తమ బాధను ఆవేదనను ప్రభుత్వానికి తెలిసేలా కన్నీరు మున్నీరుగా రైతులు విలపిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే నీట మునిగిన మా పంటలను పరిశీలించి పంట నష్టం కింద ప్రభుత్వం ఆర్థిక భరోసా అందేలా చర్యలు తీసుకోవాలని అలాగే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను వారు వేడుకుం టున్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిసేలా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించాలని కాకివాయి గ్రామ రైతులు అభ్యర్థిస్తున్నారు.

# జిల్లాలో భారీ వర్షాలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం తిరుపతి జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమ త్తంగా ఉండాలని, కూటమి నాయకులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు. భారీ వర్షాలు కారణంగా చెరువులు, కుంటలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు అధికారులను ప్రజలు కూటమి నాయకులు అప్రమత్తం చేయాలని సూచించారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తిరుపతి జిల్లాలో భారీ వర్షం కురుస్తుంది.మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పంటల కోతలు చేయరాదని, కల్లాలలో ఉన్న పంటలు కాపాడుకోవడానికి టార్పాలిన్ పట్టాలతో సిద్ధంగా ఉండాలన్నారు. కూటమి నాయకుల అధికారులు, గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా చెరు వులు, నీటి కుంటలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున అటువంటి అవకాశం ఉన్న ప్రాంతాలను ప్రజలు, అధికారులు గుర్తించి ముందుగానే ప్రమాదం జరగకుండా సస్యరక్షణ చర్యలను చేపట్టాలని పిలుపునిచ్చారు. అధికారులు, కూటమి నాయకులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందుకు సాగాలన్నారు.

# ఉద్యోగులను దగా చేస్తున్న ప్రభుత్వం

**- చంద్రబాబుది ఉద్యోగ వ్యతిరేక పాలన : ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఫైర్ - డీఏ బకాయిలను వడ్డీ లేకుండా రిటైర్మెంట్ సమయంలో తీసుకోవాలా? - మిగతా 3 డీఏల పరిస్థితి ఏంటి? - పీఆర్సీ కమిషన్ ఎప్పుడు వేస్తారు? - పీఆర్సీ కమిషన్ వేసేలోపు తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించాలి - ఉద్యోగుల బకాయిలు రూ.34 వేల కోట్లు విడతల వారీగా ఇప్పటి నుంచే చెల్లించాలి : ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఒకపక్క ఉద్యోగుల పొట్టగొడుతూ వారి సంపదను స్వాహా చేస్తున్న కూటమి ప్రభుత్వం వారిని ఉద్ధరించినట్టుగా ప్రచారం చేసుకుంటోందని, మొన్న దీపావళి సందర్భంగా రిలీజ్ చేసిన ఒక పెండింగ్ డీఏ కూడా మోసమేనని వైయస్సార్సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దీపావళికి ముందు చంద్రబాబు ఉద్యోగులతో మాట్లాడి ప్రెస్‌మీట్ పెడితే ఏదో ఉద్ధరిస్తాడనుకుంటే నాలుగు పెండింగ్ డీఏల్లో ఒకే ఒక్కటి రిలీజ్ చేస్తామని చెప్పాడని అన్నారు. ఆ అరియర్స్‌ని కూడా రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని చెప్పి ఉద్యోగుల కడుపు మీద కొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ కమిషన్, ఐఆర్, రూ. 34 వేల కోట్ల పెండింగ్ బకాయిల గురించి ప్రస్తావించకుండానే చంద్రబాబు ప్రెస్‌మీట్ ముగించడం చూస్తే ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అర్థమైందని ధ్వజమెత్తారు. ఇంకా ఆయనేమన్నారంటే...





**ఇచ్చిన ఒక్క డీఏ కూడా మోసమే**

ఉద్యోగులను ఉద్ధరించేసినట్టుగా రెండు రోజులుగా కూటమి ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుంటోంది. ఉద్యోగులకు డీఏ ధమాకా, దీపావళి బొనాంజా అంటూ ఎల్లో మీడియాలో ప్రచారం చేసుకుంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు పక్కడపెడితే వారికి హక్కుగా దక్కాల్సినవే ఇవ్వకుండా ఒక డీఏ రిలీజ్ చేసి వారికి బిక్షం వేస్తున్నట్టు మట్లాడుతున్నారు. రెండు రోజుల క్రితం దీపావళికి ముందు నేరుగా సీఎం చంద్రబాబు ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవడంతో ఈసారి ఉద్యోగుల హామీలన్నీ నెరవేరుస్తారని అనుకున్నారు. నాలుగు డీఏలు ఇవ్వడంతోపాటు పీఆర్సీ కమిషన్ వేస్తారు, పెండింగ్ అరియర్స్ రిలీజ్ చేస్తారని, 30 శాతం ఐఆర్ ఇస్తారని ఉద్యోగులంతా భావించారు. కానీ తీరా చూస్తే సీఎం చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టి ఒకే ఒక్క డీఏ ఇచ్చేయడం చూసి ఉద్యోగులంతా నివ్వెరపోయారు. పీఆర్సీ కమిషన్ పైగానీ, ఐఆర్ పైగానీ, పెండింగ్ అరియర్స్ విషయంలో కానీ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా చాలించాడు. ఇచ్చిన డీఏలోనూ ఉద్యోగులకు జరిగిన మోసమే కనిపిస్తోంది.

**వైయస్ఆర్‌సీపీ అయిదేళ్ళ పాలనలో 11 డీఏలు**

వైయస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలలో ఆర్నెళ్లకు ఒక డీఏ చొప్పున 10 డీఏలు ఇవ్వడంతో పాటు గత చంద్రబాబు ప్రభుత్వం పెండింగ్ పెట్టిన డీఏ ను కూడా రిలీజ్ చేసి మొత్తం 11 డీఏలు ఇచ్చారు. మాజీ సీఎం వైయస్ జగన్ నాలుగు డీఏలు పెండింగ్ పెడితే అందులో ఒక డీఏ ఇస్తున్నట్టు చంద్రబాబు డీఏల విషయంలో పచ్చి అబద్ధాలు చెప్పాడు. 2024 లో జనవరి, జూన్ తోపాటు 2025 జనవరి జూన్ నెలల డీఏలు ఇవ్వాల్సి ఉందని చంద్రబాబే చెబుతున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవ్వాల్సిన డీఏలను కూడా జగన్ ఖాతాలో వేసి తప్పించుకోవాలని చూడటం హేయం. వైయస్సార్సీపీ హయాంలో ఒక డీఏ పెండింగ్‌లో ఉండటానికి కూడా కారణం కేంద్ర ప్రభుత్వ జాప్యమే. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం డీఏ రిలీజ్ చేసిన తర్వాత రాష్ట్రాలు ప్రకటించడం అనేది ఆనవాయితీ. ఆ ప్రకారం కేంద్రం జనవరి 2024లో రిలీజ్ చేయాల్సిన డీఏను మార్చి 6న ప్రకటించడంతో ఆ వెంటనే మార్చి 11న ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రకటించలేకపోయాం. 2024 జనవరి డీఏను ఇప్పుడు ప్రకటించారు. దానికి సంబంధించి డీఏ అరియర్స్ ని కూడా రిటైర్ అయ్యేటప్పుడు ఇస్తామనడం దారుణం. చంద్రబాబు తప్ప దేశంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా చెప్పడం చూడలేదు. పైగా ఈ అమౌంట్‌ను పీఎఫ్ అకౌంట్ లో కూడా జమ చేస్తామని చెప్పకపోవడం దుర్మార్గం. ఇప్పుడు ఎంత బకాయి ఉందో ఆ మొత్తమే వడ్డీ కూడా లేకుండా 30 ఏళ్ల తర్వాత ఇస్తామని చెప్పడం ఉద్యోగులను దారుణంగా వంచించడమే. చంద్రబాబు తీసుకొస్తున్న ఇలాంటి కొత్త సంస్కృతితో ఉద్యోగుల జీవితాలు ఏమైపోతాయో ఆలోచించాలి. రిటైర్ అయిన ఉద్యోగుల డీఏల గురించి ఏమీ ప్రస్తావించడం లేదు.

**పీఆర్సీ కమిషన్ ఊసే లేదు**

పీఆర్సీ కమిషన్ కాల పరిమితి ముగిసి ఇప్పటికే రెండేళ్ళ మూడు నెలలు గడిచిపోయింది. అయినా కొత్త పీఆర్సీ వేయలేదు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో పీఆర్సీ కోసం వేసిన కమిషన్‌ను కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడగానే, కమిషనర్ చైర్మన్‌తో రాజీనామా చేయించారు. తరువాత ఈరోజుకీ పీఆర్సీ కమిషన్ వేయడానికి కూడా చంద్రబాబుకి మనసు రావడం లేదు. ఈరోజు పీఆర్సీ కమిషన్ వేసినా దాని నివేదిక వచ్చి అమలు చేయడానికి కనీసం ఏడాది సమయం పడుతుంది. ఉద్యోగుల సంఘాల మీటింగ్‌లో పీఆర్సీ కమిషన్ వేస్తామని చెప్పకుండా తప్పించుకోవడం దుర్మార్గం కాదా? పీఆర్సీ వేయనప్పుడు ఐఆర్ ఇవ్వడం ఆనవాయితీ. కానీ రెండేళ్ళ మూడు నెలల కాలంలో ఐఆర్ కూడా ఇవ్వని దారుణ పరిస్థితిని చంద్రబాబు నేతృత్వంలో ఉద్యోగులు ఎదుర్కుంటున్నారు. కోవిడ్ వంటి పరిస్థితులున్నా సాకులు చెప్పి తప్పించుకోకుండా ఆరోజున వైయస్ జగన్ 23 శాతం పీఆర్సీ ఇచ్చి ఉద్యోగుల పక్షాన నిలిచారు. 27 శాతం ఇస్తామని చెప్పి 23 శాతమే ఇచ్చారని, ఇది రివర్స్ పీఆర్సీ అని ఆరోజున, ఎన్నికల సమయంలో కూడా చంద్రబాబు సహా కూటమి నాయకులు ప్రచారం చేసుకున్నారు. నాటి వైయస్సార్సీపీ ప్రభుత్వాన్ని హేళన చేసి మాట్లాడిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా పీఆర్సీ ఎందుకు ఇవ్వలేదు. కనీసం కమిటీ కూడా వేయకపోగా వైయస్ జగన్ హయాంలో వేసిన కమిటీతో కుట్రపూరితంగా రాజీనామా చేయించారు.

**రూ.34 వేల కోట్లకు ఉద్యోగుల బకాయిలు**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వైయస్ జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.22 వేల కోట్లు ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలున్నాయని చంద్రబాబు గెలిచిన వెంటనే అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశాడు. ఆ రూ.22 వేల కోట్లు దఫదఫాలుగా చెల్లిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఉద్యోగుల ఓట్లతో గెలిచిన చంద్రబాబు, తీరా గెలిచాక వాటి ఊసే ఎత్తడం లేదు. చంద్రబాబు ఇచ్చిన శ్వేతపత్రంలో రూ.22 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని చెప్పాడు. మొన్నటి ప్రెస్‌మీట్‌లో రూ.34 వేల కోట్ల అరియర్స్ ఉన్నాయని చెబుతున్నాడు.

బకాయిలు చెల్లిస్తానని చెప్పి, ఏకంగా రూ. 12 వేల కోట్లు పెంచేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఇది మోసం కాదా? రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఏవైనా ఉంటే వెంటనే చెల్లిస్తారు. కానీ చంద్రబాబు మాత్రం 2027-28 లో 12 వాయిదాల్లో ఇస్తానని చెప్పడం వారిని వేధిం చడమే. పింఛన్ పై ఆధారపడి జీవించే వృద్ధులను కూడా వేధించడం న్యాయమా అని చంద్రబాబు ఆలోచించుకోవాలి. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా కర్నాటక, తమిళ నాడుతో పోల్చి చూపించి ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలి, ఉద్యోగుల జీతాలు తగ్గించుకోవాలని చంద్రబాబు హేళనగా మాట్లాడుతున్నాడు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు చేస్తున్న దుబారాను తగ్గిస్తే, ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గుతుంది. వాలంటీర్లకు జీతాలు పెంచుతానని చెప్పి, వారిని రోడ్డు పాలు చేశారు. సచివాలయ ఉద్యోగుల విషయంలోనూ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మీకు అనవసరంగా జీతాలిస్తున్నామని సచివాలయ ఉద్యోగులను ఉద్దేశించి అనడం సరికాదు. పోలీ సులకు 4 సరెండర్ లీవ్‌లకుగానూ ఒక్కదానికే అనుమతి ఇస్తూ, రెండు నెలల తరువాత రూ.105 కోట్లు విడుదల చేస్తాను అని చెప్పడం దారుణం. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని ఆదుకునేందుకు సీఎంగా వైయస్ జగన్ దానిని ప్రభుత్వపరం చేస్తే, దానిపైనా సీఎం చంద్రబాబు వక్రబాష్యం చెబుతున్నాడు. ఆర్టీసీని కాపాడాలనే ఉద్దేశమే ఆయనకు లేదు.

## సరయు హీరో షోరూం సబ్ డీలర్ మేక వేమయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రావణ్ కుమార్‌ని వెంటనే అరెస్ట్ చేయాలి : ఎంఆర్‌పిఎస్ ఎంఎస్‌పి నేతల డిమాండ్



**గూడూరు, (రాజధాని వార్తలు):** పొదలకూరు మండల టౌన్‌లోని డా బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ లు మాట్లాడుతూ గత నెల 24 తేదిన గూడూరు లోని విశ్వసాయి షోరూం డీలర్ శ్రావణ్ కుమార్ అనే వ్యక్తి మేక వేమయ్య హీరో షోరూంకు ఆయన లేని సమయంలో వచ్చి అక్కడ వర్కర్స్ ను ఎక్కడకు పోయాడురా వేమయ్య కులం తక్కువ నాకొడుకు అంటూ అహంకారం పౌరుష పధజాలంతో కులం పేరుతో అతనిని తిడుతూ షోరూంలో కొనుగోలుకి సిద్ధంగా ఉన్న ఏడు బైకుల తాళాలు దౌర్జన్యంగా లాక్కొని పోయిన శ్రావణ్ కుమార్‌ని వెంటనే అరెస్ట్ చేయాలి. అతనిపై స్థానిక పొదలకూరులో పిర్యాదు ఇచ్చిన ఇప్పటి వరకు పలుమార్లు సీఐ ఎస్ఐ చుట్టూ తిరుతున్న ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో డిపార్ట్మెంట్ వరు సమాధానం చెప్పాలని మీరు ప్రలోభాలకు తలొగ్గి కేసు నమోదు చేయకుండా వెనకడుగు వేస్తున్నారో చేప్పాలని ఇది వరకే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళిన ఎందుకు ఈ విషయంలో పోలీసులు కేసు నమదు చేయకపోవడం చూస్తుంటే ఉన్నత వర్గాల కోసమే చట్టాలు ఉన్నట్టు అనిపిస్తుందని ఇప్పటికైనా జిల్లా ఎస్పీ స్పందించి వెంటనే కేసు నమోదు చేసే విధంగా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు వేగూరి వెంకటేశ్వర్లు మాదిగలు మాట్లాడుతూ అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన శ్రావణ్ కుమార్ ని 24 గంటల్లో అరెస్ట్ చేయాలని లేని పక్షంలో అవసరమైతే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ దృష్టికి తీసుకు వెళ్తామని వారి ఆదేశాలతో చలో పొదలకూరు పిలుపునకు కూడ వెనకడుగు వేయబోమని తక్షణమే శ్రావణ్ కుమార్‌ని అరెస్ట్ చేయాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతకుంట అంకయ్య మాదిగ, దర్శిగుంట శ్రీనివాస్ మాదిగ, నక్కిబోయిన గంగాధర్ మాదిగ, సబ్బు వెంకటేశ్వర్లు మాదిగ, వెంకటేశ్వర్లు మాదిగ, నరసింహ మాదిగ, ఏడు కొండలు మాదిగ, మేక రమేష్ మాదిగ.పి పెంచలయ్య మాదిగ, కుంచం సుబ్బయ్య మాదిగ, శివ మాదిగ, సూర్యబాయ్ మాదిగ, బాలకృష్ణ మాదిగ, చంద్ర మాదిగ, మురళి మాదిగ, వెంకటగిరి, సర్వేపల్లి నియోజకవర్గాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కండలేరు జలాశయాన్ని ముంచెత్తుతున్న వరద

**- తుఫాను పరిస్థితులపై అధికారులతో వెంకటగిరి ఎమ్మెల్యే సమీక్ష**

**- అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన**









**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లాలోని కండలేరు జలాశయానికి వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడంతో జలాశయం ను మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులతో కలిసి పరిశీలించారు అనంతరం డ్యాం అతిది గృహంలో ఇంజినీర్లతో కలిసి సమీక్ష నిర్వహించారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. "తుఫాన్ కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటే, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని విభాగాల అధికారులు సిద్ధంగా ఉండాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎప్పటికప్పుడు నీటి స్థాయిని మానిటర్ చేస్తూ, అవసరమైతే అధికారులు గ్రామస్తులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్తులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో రాపూరు మండలం టీడీపీ నాయకులు ఉన్నారు.

## వైసీపీ నేతలు మీరా మొహిద్దీన్, అబ్దుల్ మస్తాన్‌తో ములాఖత్ అయిన పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇటీవల దురదృష్టవశాత్తు అరెస్టు అయ్యి.. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న వైసీపీ సీనియర్ నాయకులు మీరా మోహిద్దీన్, అబ్దుల్ మస్తాన్‌ను వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మూలాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి చంద్రశేఖర్ రెడ్డి ధైర్యం చెప్పారు.

## కందుకూరు నియోజక వర్గంలో లక్ష్మీనాయుడు హత్యను ఖండించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు - బాధిత కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ప్రకటన



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన లక్ష్మీనాయుడు హత్యను ముఖ్యమంత్రి చంద్రబాబు ఖండించారు. శాంతిభద్రతలపై సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హత్య ఘటన అమానవీయం, అమానుషమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం తరఫున పరిహారం ప్రకటించారు. మృతుని భార్యకు రెండెకరాల భూమితో పాటు రూ.5లక్షల నగదు, ఇద్దరు పిల్లలకు రెండెకరాల చొప్పున భూమితో పాటు రూ.5లక్ష నగదు ఫిక్సిడ్ డిపాజిట్ చేయాలని ఆదేశించారు.

# సంపాదకీయం

## వ్యూహాత్మక స్వతంత్రతే భారత్ బాట

'అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు పిచ్చెక్కినట్లుంది..' అని ప్రపంచ వ్యాప్తంగా సంఖ్యానేకులు అభిప్రాయపడుతున్నారు. 30 ట్రిలియన్ డాలర్ల వార్షిక జీడీపీ ఉన్న అతిపెద్ద ఆర్థిక శక్తి అమెరికా. అంతేకాదు, అది అతిపెద్ద మిలటరీ సూపర్ పవర్ కూడా. పెంటగాన్ (అమెరికా రక్షణ మంత్రిత్వశాఖ నెలవు) ఆయుధాగారంలో వేలాది అణ్వస్త్రాలు ఉన్నాయిబీ అమెరికా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు, నిత్యం ప్రపంచ మహాసముద్రాలలో నలు మూలలా సంచరిస్తుంటాయిబీ 70 దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలున్నాయి. గత ఏడాది అమెరికా తన సైనిక శక్తిపై వేయి బిలియన్ డాలర్లు ఖర్చుపెట్టింది. ప్రపంచ పటం నుంచి ఏ దేశాన్ని అయినా తుడిచి పెట్టగలిగిన శక్తి అమెరికాకు ఉన్నది. ఇంత మహాశక్తికి సర్వాధినేత అయిన అధ్యక్షుడు ట్రంప్ ఎంత బాధ్యతగా ఉండాలి? రెండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ట్రంప్ స్థిమితం లేనట్లు మాట్లాడుతున్నారు. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువో తేల్చుకోలేకపోతున్నారు. భారత్‌పై కక్షసాధింపుగా అన్నట్లు హెచ్-1బి వీసా, టారిఫ్‌ల విషయమై రకరకాల ప్రకటనలు గుప్పిస్తున్నారు. భారత్-పాక్ సంఘర్షణలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడ సంఘర్షణ తలెత్తినా అమెరికా తలదూరుస్తోంది. ప్రతి దేశానికీ సార్వభౌమాధికారం ఉంటుందన్న మాట మరిచి ఆయా దేశాల పక్షాన ట్రంప్ తానే ప్రకటనలు చేస్తున్నారు! ఆపరేషన్ సింధూర్ గురించి రకరకాల ప్రకటనలు చేసిన ట్రంప్ రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలని భారత్‌ను హెచ్చరించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు మానేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చినట్లు కూడా ట్రంప్ తాజాగా ప్రకటించారు. అలాంటి హామీ ఏదీ తామివ్వలేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. అయినా భారత్‌పై టారిఫ్‌లు భారీ ఎత్తున పెంచక తప్పదని ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మొదట్లో ట్రంప్ మాటలకు విశ్వసనీయత ఉన్నదని భావించిన వారు సైతం ఇప్పుడు ఆయన అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ట్రంప్ ప్రకటనలను భారత్ ఏమీ లెక్కచేయనక్కర్లేదని భావిస్తున్నారు. చివరకు అమెరికా ప్రజలు కూడా ట్రంప్ వాచాలతకు విసుగు చెందుతున్నట్టు స్పష్టమవుతోంది. అమెరికా టెక్నాలజీ సంస్థలు కూడా ట్రంప్ హెచ్చరికలతో నిమిత్తం లేకుండా భారత్‌లో పెట్టుబడులు పెడుతున్నాయి. వైజాగ్‌లో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థ నిర్ణయించడమే అందుకొక ఉదాహరణ. భారత్‌లో తన విస్తరణను నిలిపివేసే ప్రసక్తి లేదని ఆపిల్ సంస్థ కూడా ప్రకటించింది. ఈ సంస్థ గత ఆరు నెలల్లో భారతదేశం నుంచి 10 బిలియన్ డాలర్ల విలువైన ఐ ఫోన్లను ఎగుమతి చేసింది. నేతల విశ్వసనీయత, పెట్టుబడులకు లభించే ఆదరణ, ఫలితాలను బట్టి పారిశ్రామిక సంస్థలు నిర్ణయాలు తీసుకుంటాయి కాని, ఉత్తుత్తి బెదిరింపులకు అవి లొంగే అవకాశాలు తక్కువ. మార్కెట్ చలన సూత్రాలు వేరుగా ఉంటాయని వేరే చెప్పనక్కర్లేదు. ఈ పండుగ రోజుల్లో భారతీయులు దాదాపు రూ. 6 లక్షల కోట్లకు పైగా సరుకులు, సేవల కోసం ఖర్చు పెట్టడమే భారతదేశంలో పెరుగుతున్న మార్కెట్ శక్తికి నిదర్శనం. అయినా ట్రంప్ ప్రకటనలను తప్పనిసరైతే ఖండించడం తప్ప ఆయనపై వ్యక్తిగతంగా పరుష విమర్శలు చేయకూడదని భారత్ వ్యూహాత్మకంగా నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. భారతదేశ వ్యతిరేక ప్రకటనలు ట్రంప్ ఎన్ని చేసినా ఆయన తనకు 'మంచి స్నేహితుడు' అని మోదీ అభివర్ణిస్తున్నారు. నిజానికి ట్రంప్ ప్రకటనల వల్ల భారతీయుల ఆత్మాభిమానం ఎక్కువగా దెబ్బతిన్నట్లు కనపడుతోంది. దాని వల్ల మోదీకి ప్రయోజనమే కాని నష్టం వచ్చే అవకాశాలు తక్కువ. ట్రంప్‌ను నేరుగా మోదీ ఎందుకు ఢీకొనడం లేదు? 'ప్రస్తుతానికి మౌనం వహించడం మినహా మనకు వేరే గత్యంతరం లేదు. అదే సరైన దౌత్యనీతి..' అని మన విదేశాంగశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. 'యుద్ధం చేయకుండానే ప్రత్యర్థిని తగ్గేలా చేయడం ఒక అద్భుత కళ' అని చైనా సైనిక వ్యూహకర్త సు జు తన 'ద ఆర్ట్ ఆఫ్ వార్'లో సూచించారు. వ్యక్తులతో నిమిత్తం లేకుండా అమెరికా లాంటి మహాశక్తి భారతదేశం వైపు ఉండడం, దాన్ని శత్రువుగా మార్చుకోకపోవడం అనేది అవసరం అని మన నాయకులు గ్రహించినట్లున్నారు. నిజానికి నరేంద్రమోదీ అమెరికాను భారత్‌కు సహజ మిత్రదేశంగా భావించారు. తాను తూర్పు తీరం నుంచి చూస్తే అమెరికా పశ్చిమ తీరం కనపడుతోందని, ఇరు దేశాలు ఒకే సువిశాలమైన ప్రాంతంలో భాగమని, తమ మధ్య స్నేహం ఇరు దేశాలకే కాక ప్రపంచ భవిష్యత్తుకు కూడా ఎంతో మంచిదని మోదీ 2014లోనే 'ఇండో-అమెరికా సీఈఓల ఫోరమ్'లో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం అమెరికాను తన అభివృద్ధి అజెండాలో సహాయకారిగానే భావించింది. మోదీ అధికారంలోకి రాగానే అమెరికాను తన హిందూ వ్యూహాత్మక అజెండాలో భాగంగా భావించారు. ప్రపంచ అగ్రరాజ్యంగా ఎదిగేందుకు భారత్‌కు ఆమెరికా అండ దోహదం చేయగలదని ఆయన ఆలోచించారు. ట్రంప్ ఎలుగెత్తుతోన్న 'అమెరికా ఫస్ట్' సిద్ధాంతానికి తన 'భారత్ ఫస్ట్' నినాదం తోడవుతుందని మోదీ అనుకున్నారు. ట్రంప్‌ను రెండోసారి గెలిపించేందుకు పనిగట్టుకుని ప్రచారం చేశారు. అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయులు పూర్తిగా ట్రంప్ వైపు మొగ్గేలా చేశారు. మోదీ ఇలా ట్రంప్‌ను పూర్తిగా విశ్వసించేందుకు ఎన్నో కారణాలున్నాయి. ప్రధానంగా పాకిస్థాన్, చైనా విషయంలో భారత్ వైఖరితో ట్రంప్ తొలుత ఏకీభవించారు. తన ఎన్నికల ప్రచారంలో ఇస్లామిక్ తీవ్రవాదాన్ని, చైనా విస్తరణ వాదాన్ని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. అంతకుముందు న్యూఢిల్లీ ఎన్ని ఫిర్యాదులు చేసినా ఉగ్రవాద బృందాలకు ఇస్లామాబాద్ మద్దతు గురించి వాషింగ్టన్ పట్టించుకునేది కాదు.

# వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వెల్లడి

### - బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాబోయే రెండు రోజులలో భారీ వర్షాలు, ఈదురు గాలులు



**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిం చింది. ఈ నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వారి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి, ప్రజల భద్రత కోసం ముందస్తు రక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, వారికి అవసరమైన సహాయాన్ని అందించి ఆదుకోవాలని తెలియజేశారు. ప్రజలు తప్పని సరిగా పాటించవలసిన అత్యవసర జాగ్రత్తలు లోతట్టు ప్రాంతాల ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా, వెంటనే సురక్షితమైన ఎత్తైన ప్రదేశాలకు తరలి వెళ్లాలి. వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించేటప్పుడు వాటిని దాటే సాహసం అస్సలు చేయవద్దు. పాత మరియు శిథిలావస్థలో ఉన్న భవనాలు, గోడలకు దూరంగా సురక్షిత ప్రాంతంలో ఉండండి. ఎలక్ట్రిక్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలను తాకవద్దు. ఇంట్లోకి నీరు వస్తే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయండి. తగినంత త్రాగునీరు, మందులు, టార్చ్ లైట్లు, కొవ్వొత్తులు, పొడి ఆహారం వంటి అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలి. వర్షంలో లేదా వరద నీటి దగ్గర పిల్లలు ఆడకుండా చూసుకోవాలి తెలిపారు.

# జల జీవన్ మిషన్ ద్వారా జిల్లాకు రూ.1650 కోట్లు

### - వాటర్ గ్రిడ్ ద్వారా త్రాగునీటి పైప్ లైన్ కారణంగా దెబ్బతినే నిర్మాణాలను అంచనా వేయండి : కలెక్టర్

**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సురక్షితమైన త్రాగునీటి సరఫరాకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.1650 కోట్లతో నిర్మిస్తున్న పైప్ లైన్ కారణంగా దెబ్బతింటున్న కట్టడాలను అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జల జీవన్ మిషన్ ద్వారా ధవలేశ్వరం వద్ద మంజూరైన వాటర్ గ్రిడ్ పథకం ద్వారా త్రాగునీటి సరఫరాకు పైపు లైన్ వ్యవస్థ నిర్మాణంలో దెబ్బతింటున్న రోడ్లు, కాలువలు మొదలైన కట్టడాల నష్టాలపై ఆయా శాఖల ఇంజనీర్లు 15 రోజులలో మాస్టర్ ప్లాన్ ప్రకారం జరిగే నష్టాల అంచనాల నివేదికలను రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, డ్రైనేజీ, జలవనరులు, పంచాయతీరాజ్ ఇంజనీర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించి వాటర్ గ్రిడ్ పథకం వల్ల జరిగే డ్యామేజీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా డామేజీలను గుర్తించడం వల్ల ఆయా పనుల నిర్వహణకు నిధులు కేటాయింపుకు ఆస్కారం ఏర్పడుతుం దని ఆ దిశగా అంచనాలను రూపొందిస్తే త్వరిత గతిన ఆయా వసతులను మరల పునరుద్ధరించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. లేనిపక్షంలో ప్రజలకు ట్రాఫిక్, కమ్యూనికేషన్ వంటి అంశాలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ముందస్తు అవగాహనతో అంచనాలను కోరడం జరుగుతోందన్నారు. శాశ్వత ఉపశమన పనులు మరమ్మ



త్తులు, బడ్జెట్ అంచనాల పట్ల మంజూరుకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ముందస్తు అవగాహన ఏర్పడుతుందన్నారు. పైప్ లైన్ వేయబోయే మార్గాన్ని సర్వే చేస్తూ ఆ మార్గంలో రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు ఇతర మౌలిక సదుపాయాలకు జరిగే నష్టాలను గుర్తించాలన్నారు. జిపిఎస్ మ్యాపింగు డ్రోన్ సర్వే ద్వారా స్థలాన్ని డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ఈ విధంగా ప్లానింగ్, మరమ్మత్తు, నివేదిక రూపకల్పన డాక్యుమెంటేషన్ సమగ్రంగా తయారు చేసేందుకు ముందస్తుగా మార్గం ఏర్పడుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ఏవీఎస్ రాజన్, ఆర్ అండ్ బి ఎస్ సి బి రాము, పంచాయతీ రాజ్ ఎస్సీ పి రామకృష్ణా రెడ్డి జల వనరుల శాఖ ఈ ఈ వెంకటేశ్వరరావు, డ్రైనేజీ ఈ ఈ ఎం.వి వి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండండి : తాసిల్దార్ సోమ్లా నాయక్



**సంగం, (రాజధాని వార్తలు):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలు భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని మండల తాసిల్దార్ సోమ్లా నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల నుండి బ్యారేజీకి అధికంగా వరద నీరు చేరుతుండటంతో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని ఆయన తెలిపారు. మత్స్యకారులు, పశువులు మేపుకునే వారు నదిలోకి దిగరాదు అని హెచ్చరించారు. భారీ వర్షాలపై అన్నీ శాఖల అధికారులను అలెర్ట్ చేశాం అని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరితే వెంటనే స్థానిక సచివాలయ సిబ్బంది, విఆర్వోలకు సమాచారం అందించాలి అని అన్నారు. పాఠశాలలకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో వర్షాలలో విద్యార్థులు బయటకు రాకూడదు అని సూచించారు. మండలంలోని ప్రజలు భారీ వర్షాల నేపథ్యంలో ఇంటి నుండి ఎవరు బయట రావద్దని తెలిపారు. వర్షాలు నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడితే వెంటనే సమాచారం అందించాలని ఆయన సూచిం చారు. మండల ప్రజలకు ఏ సహాయం అవసరమైన ఎప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు.

# పట్టణంలో మున్సిపల్ కమిషనర్ తనిఖీలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ రెడ్డి పర్యటించి పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఆయన సామర్లకోట రోడ్డులోని డివైడర్‌లలో మొక్కలు పరిశీలించారు. అలాగే అన్నాక్యాంటీన్ తనిఖీ చేసి ఆహార నాణ్యతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇంకా చలవారి చెరువు ప్రాంతంలో మేజర్ డ్రెయిన్‌ను ఆయన పరుశీలించారు. అలాగే మున్సిపల్ మెప్మా విభాగంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి "పురమిత్ర" యాప్ డౌన్లోడ్‌లు పెంచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది,




మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# యువకుని అనారోగ్యానికి కారణం పోలీసుల దాడి కాదు : మీడియా సమావేశంలో డి ఎస్పీ స్పష్టత




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా చోటు చేసుకున్న యువకుని అస్వస్థత సంఘటన కేవలం అతని ఆరోగ్య సమస్యలనే జరిగినది తప్ప పోలీసుల దాడి కాదని పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రాజు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో దీపావళి సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన ఘటనపై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏట దీపావళి సందర్భంగా బ్రౌన్ పేటలోని పలు వీధులకు చెందిన యువకులు బ్యాచ్లుగా విడిపోయి తారా జువ్వలు పోటీని నిర్వహించడం జరుగుతూ వస్తుం దన్నారు. ఆ విషయం ఇదివరకే తెలిసి ప్రధాన సెంటర్లలో ముందుగానే తమ సిబ్బందిని భద్రత నిమిత్తం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే అదే బ్రౌన్ పేట సెంటర్లో సీఐ కృష్ణ భగవాన్ విధుల్లో ఉండగా ముఖ్యమైన ఫోన్ రావడంతో సిఐ బయటకు వెళ్లి అదే సెంటర్లో సతీష్ గోపి అనే కానిస్టేబుళ్లను ఉంచినట్టు చెప్పారు. అయితే తారా జువ్వలు నేలపై వేస్తున్న గుంపులను చెదరగొట్టే ప్రయత్నం చేయగా దానికి భయపడి యువత పరుగులు తీసినట్టు డీఎస్పీ చెప్పారు. ఆ క్రమంలోనే దడాల అక్షయ్ అనే 18 ఏళ్ళ యువకుడు పరిగెత్తుకొని వెళ్లి అతని ఇంటి వద్ద పడిపోయినట్టు యువకుడు అక్షయ్ కోలుకున్న తర్వాత ఆసుపత్రిలో వాంగ్మూలం ఇచ్చినట్టు ఆయన వివరించారు. ఇంకా తనకు అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చే సందర్భాలు ఉన్నాయని, ఆ క్రమంలోనే సోమవారం రాత్రి పోలీసులకు భయపడి పరుగులు అదే బలహీనత వచ్చి ఇంటి వద్దకు వెళ్లేసరికి పడిపోయానని, అంతే తప్ప పోలీసులు తనను గాయపరచలేదని స్పష్టం చేసినట్టు డీఎస్పీ చెప్పారు. దానిని యువకుని తల్లి కూడా నిర్ధారించినట్టు చెప్పారు. కాగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడిన సందర్భాన్ని బట్టి యువకుడు అక్షయ్‌కు వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించగా యువకులు యువకుని ఆరోగ్య పరిస్థితి పరిస్థితి బాగుందని, ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని డీఎస్పీ శ్రీహరి రాజు చెప్పారు. ఈ సందర్భంగా యువకుని వాం గ్మూల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈ సమా వేశంలో సామర్లకోట పెద్దాపురం సిఐలు ఏ కృష్ణ భగవాన్, క్రాంతి కుమార్, క్రైమ్ సీఐ అంకబాబు, ఎస్సైలు మూర్తి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో వసతులపై ఆర్డీవో తనిఖీలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల కున్న వసతులను పెద్దాపురం ఆర్డీవో కె శ్రీరమణి పరిశీలించారు. సుధాకాలనీ లో ఉన్న సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలర వసతి గృహాన్ని, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్, లూథరన్ హైస్కూల్‌లోని పాఠశాల పిల్లల బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆర్డీవో శ్రీరమణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్శనలో విద్యార్థులకు రోజూ అందుతున్న వసతులు, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలపై పరిశీలించి సిబ్బందిని ప్రశ్నించి తెలుసుకున్నారు. అలాగే వంటశాలలను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యతను ఆమె తనిఖీ చేశారు. వసతి గృహాలోని వాతావరణం, పరిశుభ్రత, విద్యార్థుల అవసరాలు వంటి అంశాలపై ఆమె విడివిడిగా విద్యార్థులతో మాట్లాడి వారిఅభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆయా హాస్టళ్ల వార్డెన్లు, పెద్దాపురం తహశీల్దార్ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

# మనుబోలు ఆర్టీసీ బస్టాండ్‌లో అనాధ శవం



**మనుబోలు, (రాజధాని వార్తలు):** మనుబోలు రెండవ సచివాలయం సమీపంలోని పాడుబడిన ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ అనాధ శవాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివ రాకేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి విచారణ చేపట్టారు. 70 సంవత్సరాల వృద్ధురాలు పేరు సుబ్బమ్మని ఆమెది కలువాయిగా గుర్తించారు. ఆమె మనవడు సురేష్ బలవంతంగా ఆమెను ఇక్కడ వదిలి వెళ్లాడని యాచన చేస్తూ అనారోగ్యంతో చనిపోయిందని ఆయన తెలిపారు.

# వరప్రసాద్ సెట్‌లో పెళ్లి కాని ప్రసాద్..!



అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్‌లో వస్తున్న సినిమా మన శంకర వర ప్రసాద్. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుంది. సినిమాకు భీంస్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పటికే మన శంకర వరప్రసాద్ గారు నుంచి వచ్చిన టీజర్‌తో పాటు మీసాల పిల్ల సాంగ్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాలో చిరంజీవిని వింటేజ్ కామెడీ టైమింగ్ తో చూపించే ప్రయత్నం చేస్తున్నాడట అనిల్ రావిపూడి. ఐతే మన శంకర వరప్రసాద్ సినిమాలో విక్టరీ వెంకటేష్ క్యామియో కూడా ఉంటుందని తెలుస్తుంది. అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబినేషన్‌లో 3 సూపర్ హిట్ సినిమాలు.. సినిమాలో వెంకటేష్ రోల్ ఏంటన్నది తెలియదు కానీ చిరంజీవి, వెంకటేష్ ఇద్దరు స్క్రీన్ మీద అలా మెరిసే సీన్స్ అన్నీ నెక్స్ట్ లెవెల్ అనిపిస్తాయట. అనిల్ రావిపూడి వెంకటేష్ కాంబినేషన్ లో 3 సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. వెంకటేష్ సెంటిమెంట్ ని చిరంజీవి సినిమాకు వాడేస్తున్నాడు అనిల్ రావిపూడి. మన శంకర వర ప్రసాద్ సినిమా షూటింగ్‌లో సోమవారం నుంచి వెంకటేష్ పాల్గొన్నారు. వర ప్రసాద్ కోసం పెళ్లికాని ప్రసాద్ అదే మన విక్టరీ వెంకటేష్ సర్ ప్రైజ్ ఇవ్వనున్నారు. ఐతే అనిల్ రావిపూడి చిరంజీవి, వెంకటేష్‌తో ఒక సాంగ్ కూడా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. ఈ సాంగ్ కచ్చితంగా కొన్నాళ్ల పాటు గుర్తుండిపోయేలా ఉంటుందని చెప్పొచ్చు. దశాబ్దాలుగా సోలో సినిమాలతో ఫ్యాన్స్‌ని అలరిస్తూ వచ్చిన చిరంజీవి, వెంకటేష్ మొదటిసారి కలిసి ఒక సినిమా చేస్తున్నారు. అఫ్కోర్స్ వెంకటేష్ చేసేది క్యామియో రోల్ అయినా కూడా కచ్చితంగా మన శంకర వరప్రసాద్ గారు మీద ఇంపాక్ట్ చూపించే ఛాన్స్ ఉంటుందని చెప్పొచ్చు. మన శంకర వరప్రసాద్ గారు సినిమాను సంక్రాంతి బరిలో దించుతున్నారు మేకర్స్. సినిమాను పండగ వైబ్‌ని డబల్ చేసేలా అనిల్ ప్లాన్ చేస్తున్నాడు. చిరంజీవి సినిమాలో వెంకటేష్ క్యామియో కచ్చితంగా ఇలాంటి కాంబినేషన్స్‌ని మళ్లీ మళ్లీ చేసేలా మంచి జోష్ ఇస్తుందని చెప్పొచ్చు. చిరంజీవితో నయనతార జత కడుతున్న ఈ సినిమా మ్యూజిక్ పరంగా కూడా అదిరిపోతుందని తెలుస్తుంది. మన శంకవర ప్రసాద్ గారులో క్యామియో ఇస్తున్న వెంకటేష్ నెక్స్ట్ త్రివిక్రం తో సినిమా షూటింగ్ మొదలు పెట్టాడు. హారిక హాసిని బ్యానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుంది.

# రిస్క్ చేయాలని డిసైడైన జాన్వీ కపూర్



ఎవరికైనా సక్సెస్, ఫెయిల్యూర్లు సహజం. అయితే సక్సెస్ ఎవరికైనా కిక్కిస్తే ఫెయిల్యూర్ మాత్రం చాలా డిజప్పాయింట్ చేస్తుంది. అయితే కొందరు మాత్రం ఫెయిల్యూర్ ను దృష్టిలో పెట్టుకుని, మళ్లీ అలాంటివి రాకుండా జాగ్రత్త పడితే, ఇంకొందరు మాత్రం ఫెయిల్యూర్ వచ్చినంత మాత్రాన దిగులు పడుతూ కూర్చుంటే ఎలా అని కెరీర్లో ముందుకెళ్తూ ఉంటారు. జాన్వీ కపూర్ ఇందులో ఆఖరి కోవలోకి వస్తుంది. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, తక్కువ టైమ్‌లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా జాన్వీ నుంచి వచ్చిన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ జాన్వీ కృంగిపోలేదు. ఆ సినిమాలు ఫ్లాప్ అయినా జాన్వీ మాత్రం తర్వాతి సినిమాను లైన్‌లో పెట్టి అందరికీ షాకిచ్చింది. టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రల్లో కరణ్ జోహార్ నిర్మాణంలో ఓ కొత్త యాక్షన్ డ్రామాకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

అయితే జాన్వీ ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం.. తాను కేవలం రొమాంటిక్ సినిమాలు మాత్రమే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోవాలనుకోవడం. రాజ్ మెహతా దర్శకత్వంలో రానున్న ఈ సినిమా యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామాతో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ మూవీలో జాన్వీకి చాలా స్ట్రాంగ్ రోల్ దక్కిందని, ఈ సినిమా ద్వారా తన ఎనర్జీ, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ ను మరింత బలంగా చూపించే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఫ్యాన్స్ మాత్రం టైగర్ ష్రాఫ్, లక్ష్యతో జాన్వీ కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు.

# నేను మహిళగా మారిన రోజు అది : ప్రియాంక చోప్రా



గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఏం చేసినా అది ప్రత్యేకంగా ఉంటుంది. భర్త, పిల్లలు, కుటుంబంతో విదేశీ బీచ్‌లలో చిలౌట్ చేస్తున్నా లేదా రెడ్ కార్పెట్ ఈవెంట్లలో క్యాట్ వాక్‌లు చేసినా, న్యూయార్క్ వీధుల్లో అప్రయత్నంగా షికార్లు చేసినా.. ప్రతిసారీ సందర్భానికి తగ్గట్టుగా తన లుక్‌తో మైమరిపిస్తుంది. అంతర్జాతీయ రెడ్ కార్పెట్ ఈవెంట్లలో పీసీ ఫ్యాషన్ సెన్స్ పరంగా విఫలం కాలేదు. పీసీ లుక్ సెన్స్, ధరించిన ఆభరణాల గురించి విస్తృతంగా చర్చ సాగుతుంది. ముఖ్యంగా ప్రియాంక చోప్రా ఆభరణాల ఎంపికలు అందరి దృష్టిని ఆకర్షిస్తుంటాయి. లగ్జరీ జ్యువెలరీ బ్రాండ్ బల్గారి గ్లోబల్ అంబాసిడర్‌గా ఉన్న ప్రియాంక చోప్రా ఆభరణాలతో వ్యక్తిగత సంబంధం గురించి తాజాగా మాట్లాడింది. తాజా ఇంటర్వ్యూలో పీసీ తనను తాను మహిళగా ఆవిష్కరించుకున్న సందర్భం గురించి మాట్లాడింది.

ప్రియాంక చోప్రా తన పారితోషికం అందుకున్న తర్వాత, మొదటగా రెండు క్యారెట్ల వజ్రాన్ని కొనుగోలు చేసానని తెలిపింది. అది కూడా తన మొదటి సినిమాకి అందిన పారితోషికాన్ని దాచుకుని ఖర్చు చేసిందట. నా వజ్రాలను నేను కొనుగోలు చేయడం అంటే నేను ఒక మహిళగా మారినట్టేనని నా తల్లి (మధు చోప్రా) చెప్పారని ప్రియాంక చోప్రా తెలిపింది. నేను కొనుగోలు చేసిన మొదటి ముఖ్యమైన ఆభరణం రెండు క్యారెట్ల వజ్రం. ఇది నా కెరీర్ ఆరంభంలో .. నా మొదటి సంతకం నుంచి దాచుకున్న డబ్బు.. అని వెల్లడించింది. రెడ్ కార్పెట్ ఈవెంట్స్, సినిమా ప్రీమియర్ల కోసం ఆభరణాల ఎంపికకు వేరే ఏదైనా విధానం ఉందా? అని ప్రశ్నిస్తే... ధరించాలనుకున్న ఆభరణం ఎలాంటిదో ఎంపిక చేసుకున్న దుస్తులు నిర్ణయిస్తాయని వెల్లడించింది. 2019 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో తెల్లటి టల్లే గౌనుతో అద్భుతమైన చోపార్డ్ డైమండ్ నెక్లెస్, చెవిపోగులను ధరించింది. అది ఆ సంవత్సరం అత్యంత చర్చనీయాంశమైన లుక్స్‌లో ఒకటిగా మారింది. 2017 మెట్ గాలా ఈవెంట్ కోసం రాల్ఫ్ లారెన్ ట్రెంచ్ గౌను ధరించింది. 2023 మెట్ గాలాలో అరుదైన 11.16-క్యారెట్ పియర్-ఆకారపు నీలిరంగు వజ్రం, లగున బ్లూను కలిగి ఉన్న అద్భుతమైన బల్గారి నెక్లెస్ లను ధరించింది. ప్రియాంక ఫ్యాషన్ అండ్ ట్రెండ్స్‌ని అనుకరించడంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఫ్యాషనిస్టా. అందాల రాణిగా యువతరం మనసుల్లో నిలిచి ఉండటానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం.

# రౌడీ జనార్ధన్ లో రౌడీ రాణిలా!



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవి కిరణ్ దర్శకత్వంలో రౌడీ జనార్దన్ రెగ్యులర్ షూటింగ్ మొదలైన సంగతి తెలిసిందే. టైటిల్ కి తగ్గట్టే విజయ్ రోల్ సినిమాలో ఉంటుందని ప్రచారం జరుగుతోంది. భారీ మాస్ టచ్ ఇస్తూ ఆ పాత్రను డిజైన్ చేసినట్లు వినిపిస్తోంది. సెట్స్ నుంచి ఏవైనా లీక్స్ వస్తే పాత్రకు సంబంధించి మరింత అప్ డేట్ తెలిసే అవకాశం ఉంటుంది. మరి హీరోయిన్ సంగతేంటి? అంటే హీరోయిన్‌గా ఇప్పటికే కీర్తి సురేష్ ఫిక్సైంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుందన్నది బయటకు రాలేదు. ఈ నేపథ్యంలో చిత్ర వర్గాల నుంచి ఆ పాత్ర కూడా అంతే మాస్‌గా ఉంటుందనే లీక్ అందింది.

కళావతి కోరిక తీరేలా: జనార్దన్ రౌడీ అయితే కీర్తి సురేష్ రోల్ రౌడీ రాణిలా ఉంటుందంటున్నారు. కీర్తి సురేష్ మునుపెన్నడు పోషించని ఓ డిఫరెంట్ పాత్రగా ప్రచారం జరుగుతోంది. మరి ఇందులో నిజాలు తేలాల్సి ఉంది. కీర్తి సురేష్ ఇంత వరకూ మాస్ పాత్రలు పోషించింది లేదు. క్లాసిక్ రోల్స్‌లో మాత్రమే కనిపించింది. కానీ ఆఫ్ ది స్క్రీన్‌లో కీర్తి సురేష్ మాస్ డైలాగ్‌లతో తనలో ఆ రకమైన ఫ్యాషన్‌ని బయట పెట్టే ప్రయత్నం చేస్తుంటుంది. తెరపై అలా కనిపించాలి...ఇలా కనిపించాలి? అన్న సందర్భంలో రౌడీ రాణిలా కూడా కనిపించాలని ఉందని ఓ సారి ఓపెన్ అయింది.

కీర్తి ఇమేజ్ మారేలా: రౌడీ జనార్దన్‌లో అదే తరహా రోల్ అయితే అమ్మడి కోరిక తీరినట్లే. ఆ వివరాలు తెలియాలంటే మరింత సమయం పడుతుంది. ఇటీవలే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ప్రస్తుతం కోలీవుడ్‌లో రివాల్వర్ రీటా అనే లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో నటిస్తోంది. ఇందులోనూ అమ్మడి పాత్ర మాస్‌గా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. కథ అంతా ఆ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. కాబట్టి ఆ పాత్ర ఆద్యంత ఆసక్తికరంగా మలుస్తారు. ఈ రెండు చిత్రాల రిలీజ్ తర్వాత కీర్తిపై ఉండే ఇమేజ్ కోణం కూడా మారుతుందేమో. కీర్తి సురేష్ అంటే ఇప్పటి వరకూ క్లాసిక్ హీరోయిన్‌గానే చూస్తున్నారు.

భారీ సక్సస్ అనివార్యమే: క్లాస్ రోల్స్..రొమాంటిక్ పాత్రలతోనే ప్రేక్షకుల్ని అలరించింది. అలాంటి నటిలో మాస్ కోణాన్ని తట్టి లేపేఓ ప్రయత్నం జరుగుతుంది. మరేం జరుగుతుందన్నది చూడాలి. ఈ బ్యూటీకి సక్సెస్ అనివార్యమైన సమయమే. సినిమాలు చేస్తున్నా? ఫలితాలు ఆశించిన విధంగా రావడం లేదు. లక్కీగా అవకాశాలైతే అందుకుంటుంది గానీ భారీ సక్సస్‌లు అందుకోవడంలో మాత్రం ఇప్పటి వరకూ వెనుకబడే ఉంది. అమ్మడి కెరీర్ మొత్తం చెఎక్ చేస్తే మహానటి తప్ప మరే సినిమా కనిపించడం లేదు. అదే ఇమేజ్ తో ఇప్పటికీ ఛాన్సులందుకుంటుంది.

# భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు సెలవు

**- పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలి - ప్రజల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు**

**- కంట్రోలు రూం నెంబర్లు : 0861 2331261, 7995576699 : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో భారీవర్షాలపై మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున, యంత్రాంగం ఎటువంటి ఇబ్బందులన్కెనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచించారు.

లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేస్తూ ఎవరూ సముద్రంలోనికి వెళ్లకుండా తగిన హెచ్చరికలు జారీ చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందించేందుకు బియ్యం, సరుకులు అందించేందుకు పౌరసరఫరాల శాఖ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అధికా రులందరూ సమన్వయంతో పనిచేసి వర్ష ముప్పును ఎదుర్కొ నేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**నీటి మునిగిన పంట పొలాల ప్రాథమిక నివేదిక సిద్ధం చేయండి : కలెక్టర్**

నీటి మునిగిన పంట పొలాల వివరాలను సేకరించి ప్రాథమిక నివేదిక సిద్ధం చేయాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. ఏయే ప్రాంతాల్లో పంట పొలాలు ఎంతమేర నీటమునిగాయో క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు అందించాలని సూచించారు.

**నేడు పాఠశాలలకు సెలవు : కలెక్టర్**

తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ నెల 22న (బుధవారం) అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్వాడీ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ ఉత్తర్వులను అన్ని రకాల పాఠశాలల యాజమాన్యాలు విధిగా అమలుచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**కలెక్టరేట్‌లో కంట్రోలు రూం ఏర్పాటు : కలెక్టర్**

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ తెలిపారు.

వర్షాల వలన ఇబ్బందులు తలెత్తితే కంట్రోలు రూం నెంబర్లు : 0861 2331261, 7995576699 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కంట్రోలు రూంలో 24 గంటలు విధులు నిర్వహించేలా సిబ్బందికి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 24 గంటల పాటు ఈ కంట్రోలు రూం పనిచేస్తుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వెంకటగిరి బాలసదన్‌లో దీపావళి వెలుగులు

**- పిల్లల నవ్వుల్లో పండుగ సంబరం - బాలసదన్‌లో దీపావళి సంబరాల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద**









**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** వెంకటగిరి పట్టణంలోని రాణీపేటలో ఉన్న బాలసదన్ ప్రాంగణం సోమవారం రాత్రి టపాసుల వెలుగులో మెరిసింది. దీపావళి పండుగ సందర్భంగా బాలసదన్ చిన్నారులకు ఆనందాన్ని పంచేందుకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద తన భర్త దొంతు బాలకృష్ణతో కలిసి ముందుకొచ్చారు. చిన్నారులతో కలిసి టపాసులు పేల్చి పండుగ సంబరాల్లో పాల్గొంటూ, వారికి స్వీట్లు, చాక్లెట్లు, బిస్కట్లు, టపాసులు పంపిణీ చేశారు. పిల్లల కళ్లల్లో ఆనందంతో పండుగ ఉత్సాహం కనిపించగా, కార్యక్రమం మొత్తం ఆవరణలో హర్షాతిరేకం నెలకొంది. చిన్నారులకు ఇది మరచిపోలేని అనుభూతిగా నిలిచింది.

**"పిల్లల ముఖాల్లో వెలుగు - అదే నిజమైన దీపావళి!" : దొంతు శారద**

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన దొంతు శారద "బాలసదన్‌లో ఉన్న చిన్నారులు నమ్మకంతో, ఆశతో ఎదురు చూస్తుంటారు. ఈ పండుగ రోజున ప్రతి ఏడు దీపావళి నాడు వారితో గడపడం నాకు మనసులో నిలిచిపోయే అనుభూతి. పిల్లల ముఖాల్లో వెలుగు కనిపించడమే నిజమైన దీపావళి. ఈ చిన్న చిరునవ్వు, వారి భవిష్యత్తుకి మార్గదర్శకం అవుతుంది" అని పేర్కొన్నారు. "పండుగలు వ్యక్తిగత ఆనందానికి మాత్రమే కాకుండా, సమాజంలోని అవసరమైన వారితో పంచుకోవాలి. ప్రతి ఒక్కరిని ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగం చేసుకోవాలని నా ఆకాంక్ష," అని తెలిపారు.

**సామాజిక స్పృహతో నిలిచిన దంపతులు**

గతంలో చైర్‌పర్సన్ హోదాలో వెంకటగిరి అభివృద్ధికి దోహదపడ్డ శారద, పదవిలో లేని సమయంలోనూ సామాజిక సేవా కార్యక్రమాలపై తీవ్ర ఆసక్తి చూపుతున్నారు. బాలసదన్‌లోని చిన్నారులకు మౌలిక అవసరాల కల్పనపై దృష్టిసారించడం, వారితో స్నేహపూర్వకంగా మమేకమవడం, ఆమె సేవా దృక్పథానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆమెకు తోడుగా భర్త దొంతు బాలకృష్ణ కూడా





కార్యక్రమాన్ని సుదీర్ఘంగా పర్యవేక్షించి, పిల్లలతో మమేకమయ్యారు.

**స్థానికుల అభినందనలు**

ఈ సేవా కార్యక్రమంపై స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. "పదవిలో లేకపోయినా సామాజిక బాధ్యతను మరిచిపోకుండా ముందుకు రావడం మాకు ఆదర్శం. ఇలాంటి ప్రజా ప్రతినిధులు ఉంటేనే సమాజం మెరుగవుతుంది" అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# అధికారులు, నాయకులు అప్రమత్తంగా ఉండాలి

**- ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ సూచనలు పాటించాలి - ముప్పు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయండి - అధికారులతో కురుగొండ్ల సమీక్ష సమావేశం**




**రాపూరు, (రాజధాని వార్తలు):** మండలం పరిధిలోని కండలేరు జలాశ యాన్ని వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ టీడీపీ నాయకులతో కలసి మంగళవారం జోరు వానలో పరిశీలించారు, ముందుగా లో లెవెల్స్ లూయిస్ వద్ద నీటి ప్రవాహన్ని పరిశీలించిన ఆయన అధికారులకు తగు సూచ నలు అందజేశారు. అనంతరం కండలేరు డ్యామ్ ఆనకట్ట వద్దకు చేరుకుని నీటి నిల్వలు, సామర్థ్యంపై అధికారులతో చర్చించారు, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కండలేరు జలాశయంను పరిశీలించి అధికారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. తుఫాను కారణంగా ప్రజలు ఇబ్బందులు గురికాకుండా అధికార యం త్రాంగం, కూటమి నాయకులు వారికి అన్ని వెల్లవేళలా అందుబా టులో ఉండాలన్నారు. కండలేరు జలాశయం సామర్థ్యం 68 టీఎంసీలు అయినప్పటికీ ఇప్పటివరకు ఎప్పుడు పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయలేదని 2020-2021 సంవత్సరంలో మాత్రం 60 టిఎంసిలను నీటిని నింపడం జరిగిందన్నారు. ప్రస్తుతం కండ లేరు జలాశయంలో 59 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. తుఫాను దృశ్య సర్వేపల్లికి చెన్నైకి వీటిని విడుదల చేస్తే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ముప్పు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, డ్యామ్ ఎస్ఐ రామకృష్ణ, రాపూరు ఎస్ఐ వెంకట రాజేష్, కండలేరు డ్యామ్ డిఈ నాగేంద్రబాబు, ఇన్చార్జి ఏఈ అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గజేంద్ర రెడ్డి, టీడీపీ నాయకులు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, చెన్ను భాస్కర్ రెడ్డి, నువ్వుల శివరామకృష్ణ నాయుడు, ప్రసాద్ నాయుడు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ ఈనెల 24న జిల్లాకు రాక : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈనెల 24న జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 3.30 గంటలకు సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి ఉదయం 7.08 గంటలకు నెల్లూరుకు చేరుకొని గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 4.00 వరకు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆరోగ్య, విద్య రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల అమలు అమృత్ పథకం, జల్ జీవన్ మిషన్,ప్రధాన్ మంత్రి సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాల పురోగతి తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతారు. కార్యక్రమానంతరం సాయంత్రం 04.35 గంటలకు వందే భారత్‌లో నెల్లూరు నుండి బయలుదేరి రాత్రి 07.40 గంటలకు గుంటూరుకు చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# తిరుమలలో భారీ వర్షం



**తిరుమల, (రాజధాని వార్తలు):** తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. శ్రీవారి ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలు తడిచి ముద్దయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండటంతో శ్రీవారి దర్శనం, గదులు, లడ్డూల కోసం వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. చలికి చిన్నారులు, వృద్ధులు వణుకుతున్నారు. శ్రీవారి ఆలయం ముందు నీరు నిలిచిపోయింది. ఘాట్ రోడ్లలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున తితిదే అప్రమత్తమైంది. పాపవినాశనం, ఆకాశగంగ, శ్రీవారి పాదాలు, ఘాట్ రోడ్లలో జాగ్రత్త చర్యలు చేపట్టింది.

# విశ్వనాథునికి ప్రత్యేక అభిషేకాలు

**మనుబోలు, (రాజధాని వార్తలు):** మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసి ఉన్న శ్రీ విశ్వనాథ స్వామి వారి యొక్క దేవస్థానం వద్ద దీపావళి అమావాస్య సోమవారం సందర్భాన్ని పురస్కరించుకొని స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించడం జరిగినది స్వామివారి దేవస్థానం వద్ద దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ఉభయ దాతలుగా గందల్ల కృష్ణయ్య అన్నపూర్ణమ్మ వ్యవహరించారు అర్చకులు శ్రీనివాసుల ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.



# దేశ అంతర్గత భద్రతకు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు

## - విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంను జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోగల 'స్మృతి వనం'లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 21న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు రామ సుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్లు ముఖ్య అథిదులుగా హాజరై, అమరవీరుల స్మృతి స్థూపం వద్ద పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ సంవత్సరం అమరులైన 191 మంది పోలీసుల వివరాలతో కూడిన పుస్తకాన్ని పోలీసు బృందం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అందజేయగా, జిల్లా ఎస్పీ పుస్తకాన్ని ఆవిష్కరించగా, విధులు నిర్వహిస్తూ, తీవ్రవాదుల దాడుల్లో మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లును అదనపు ఎస్పీ పి.సౌమ్యలత చదివి వినిపించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ దేశంలో మావోయిజం తీవ్రంగా ఉన్న సమయంలో దేశ అంతర్గత భద్రత కోసం, మావోయిస్టుల తీవ్రవాద కార్యక్రమాలను అరికట్టేందుకు వారితో పోరాటం చేసి, ఎంతోమంది పోలీసు అధికారులు, సిబ్బంది తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న పోలీసులు, పారా మిలటరీ దళాలు శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా మావోయిస్టులు, తీవ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులతో వీరోచిత పోరాటం చేసిన కారణంగా తీవ్రవాద కార్యకలాపాలు తగ్గుముఖం పట్టి, నేడు మనమందరం స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించే అవకాశం కల్పించారన్నారు. ఈ పోరాటంలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని, వారి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎంతో ధైర్య, సాహసాలతో మావోయిస్టుల చర్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వహించి మావోయిస్టుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయి అమరులైన ముద్దాడ గాంధీ, చిట్టిపంతులు చిరంజీవి, షేక్ ఇస్మాయిల్, బి.శ్రీరాములు, ఎస్. సూర్యనారాయణ పోలీసులను వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. అనంతరం, అమరులైన పోలీసులను స్మరించుకొంటూ, అమర వీరుల స్మృతి స్థూపం వద్ద జిల్లా కలెక్టరు రామసుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎం.బబిత, జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి మీనాదేవి, పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కే.నాగమణి, కోరుకొండ సైనిక్ స్కూలు ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శర్మ, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ప్రజా ప్రతినిధులు పాలవలస యశస్వి, అదనపు ఎస్పీ సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విధి నిర్వహణలో అమరులైన ముద్దాడ గాంధీ, చిట్టిపంతుల చిరంజీవిరావు, షేక్ ఇస్మాయిల్ కుటుంబ సభ్యులు, పలువురు డిఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పోలీసు అమర వీరుల స్థూపం వద్ద రీత్లను, పుష్పాలను సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. రిజర్వు ఇన్స్పెక్టరు ఎన్. గోపాల నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించగా, పోలీసుల తుపాకుల విన్యాసంతో అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ, రెండు నిమషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా చెల్లపిల్ల సుజాత వ్యవహరించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత, జిల్లా కలెక్టరు రామ సుందర్ రెడ్డి, ఎమ్మెల్యే అధితి విజయ లక్ష్మి, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మరియు ఇతర పోలీసు అధికారులు మమేకమై, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని, వారికి పండ్లు, నగదును అందజేసి, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న భరోసాను కల్పించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుండి కలెక్టరు ఆఫీసు జంక్షన్ వరకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల సేవలను కీర్తిస్తూ, ర్యాలీ, మానవ హారం నిర్వహించి, నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు రామసుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఐబిత, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఫస్ట్ అదనపు డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి మీనాదేవి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కే.నాగమణి, సైనిక స్కూలు ప్రిన్సిపాల్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, విజయనగరం డిఎస్పీ ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, చీపురుపల్లి డిఎస్పీ రాఘవులు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, ఎఆర్ డిఎస్పీ ఈ.కోటి రెడ్డి, ఎ.ఓ.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్ఐలు, డిపిఓ పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి, పోలీసు అసోసియేషను రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

## - గెడ్డల్లోని ఇసుక స్థానిక అవసరాలకు మాత్రమే : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి




**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాల్లోని చిన్నచిన్న నదులు, గెడ్డల్లో అనుమతి పొందిన థర్డ్ ఆర్డర్ రీచుల్లో దొరుకుతున్న ఇసుక ఆయా గ్రామాల అవసరాలకు మాత్రమేనని, ఇతర ప్రాంతాలకు రవాణా చేయడానికి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. వారికి ఇస్తున్న కూపన్లపై తప్పనిసరిగా తేది, పంచాయితీ కార్యదర్శి సంతకం ఉండాలని ఆదేశించారు. ఇలాంటి రీచుల్లో ఎక్కడా ఇసుక తవ్వకానికి మిషన్లు వాడకూడదని, వాడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు చేయకుండా, అనుమతి పొందిన 48 థర్డ్ ఆర్డర్ ప్రదేశాల్లోనే ఇసుక తవ్వకాలు జరపాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక లభ్యత, డిమాండ్‌పై సమీక్షించారు. థర్డ్ ఆర్డర్ రీచ్‌లు 48 ఉన్నాయని, రెండు స్టాకు పాయింట్ల ద్వారా నాణ్యమైన ఇసుకను శ్రీకాకుళం జిల్లానుంచి తెప్పించి అందుబాటులో ఉంచామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్ వివరించారు. జిల్లాలో ఏడాదికి సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, ఆ మేరకు అందుబాటులో ఉంచుతున్నామని గనులశాఖ డి.డి సి. హెచ్ సూర్యచంద్రరావు తెలిపారు. కొత్తవలస వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని చెప్పారు. రుతుపవనాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఇసుక ప్రణాళికలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. త్రాగునీటి పథకాలవద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. థర్డ్ ఆర్డర్ రీచుల్లోని ఇసుక స్థానిక అవసరాలకు మాత్రమేనని, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ రీచ్‌ల జాబితాను సంబంధిత తాహసీల్దార్లకు, పోలీసులకు అందజేయాలని, ఆయా చోట్ల ఇసుక తవ్వకాలు, రవాణాపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. డీసిల్టింగ్ పూర్తయిన చోట, నాణ్యత తక్కువతో లభించే ఇసుకను ఫిల్లింగ్‌కు వినియోగించేలా చూడాలని సూచించారు. అదేవిధంగా అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలపైనా దృష్టి సారించాలని ఈ సందర్బంగా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జె.సి సేధుమాధవన్‌తో పాటు, మైన్స్ డి.డి సూర్యచంద్రరావు, డిటిసి మణికుమార్, ఆర్‌డిఓలు డి.కీర్తి, రామ్మోహన్, ఆశయ్య, డిపిఓ మల్లికార్జునరావు, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, పొల్యూషన్ ఇఇ సరిత, పలువురు తాహసీల్దారులు పాల్గొన్నారు.

# యూరియా కార్డులు పంపిణీ చేసిన టిడిపి నాయకులు



**మనుబోలు, (రాజధాని వార్తలు):** మనుబోలు మండలం అక్కంపేట సచివాలయంలో మంగళవారం యూరియా కార్డులను రైతులకు టిడిపి నేతల చేతుల మీదుగా పంపిణీ చేశారు యూరియా పంపిణీకి కార్డులు తప్పనిసరి అని కూటమి ప్రభుత్వం నిబంధనల మేర గ్రామంలోని అందరూ రైతులకు యూరియా కాట్లలను పంపిణీ చేసిన చేశారు నీతో యూరియా కావాల్సిన రైతులు తమ వద్ద ఉన్న కార్డులను చూపించి ఏరియాను తీసుకు వెళ్ళవచ్చు అని అధికారి తెలిపారు ఈ కార్యక్రమంలో మైనార్టీ నేత అమీర్ భాష నీటి సంఘం అధ్యక్షులు కోదండరామిరెడ్డి, ఇనమడుగు పెంచలరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ శివ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

## : జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి




**విజయనగరం, (రాజధాని వార్తలు):** దేశం, రాష్ట్ర, జిల్లా ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరులకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంను జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోగల 'స్మృతి వనం'లో జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు సిబ్బంది త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతి స్థాపన, నేర నియంత్రణలో పోలీసు శాఖ పోషిస్తున్న పాత్ర అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు.

పోలీస్ శాఖ నిబద్ధత, క్రమశిక్షణ, ధైర్యసాహసానికి చిహ్నమని కలెక్టర్ అభివర్ణించారు. సమాజంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు రామసుందర్ రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఎం.బబిత, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్లు ముఖ్య అథిదులుగా హాజరై, అమరవీరుల స్మృతి స్థూపం వద్ద పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

# వి.ఎస్.యూ మహిళా హాస్టల్‌లో తాత్కాలిక విద్యుత్ అంతరాయం - వీసీ తక్షణ చర్యలతో పునరుద్ధరణ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మహిళల వసతి గృహానికి ట్రాన్స్‌ఫార్మర్ నుండి వచ్చే మెయిన్ లైన్ వాతావరణ ప్రతికూలతల కారణంగా దెబ్బతినడం వలన తాత్కాలికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే, విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు హాస్టల్‌ను సందర్శించి, పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. కొద్ది గంటల్లోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేలా సాంకేతిక విభాగం సహకారంతో సమర్థవంతమైన చర్యలు తీసుకున్నారు. హాస్టల్లో ఉండే విద్యార్థుల భద్రత, దైనందిన విద్యా కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా విశ్వవిద్యాలయం చురుకైన చర్యలు తీసుకోవడం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి. హెచ్. విజయ, హాస్టల్ వార్డెన్లు ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించి అవసరమైన సహకారం అందించారు. వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, "విశ్వవిద్యాలయం విద్యార్థుల సంక్షేమాన్ని మొదటి ప్రాధాన్యంగా భావిస్తుంది. అనుకోని సమస్యలు వచ్చినప్పుడు వాటి పరిష్కారం కోసం వేగవంతమైన చర్యలను చేపట్టడమే కాకుండా, ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా



శాశ్వత పరిష్కారాలపై కూడా దృష్టి సారిస్తున్నాము. మహిళా హాస్టళ్ల భద్రత, సదుపాయాల విస్తరణ మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్ బలోపేతం కోసం విశ్వవిద్యాలయం కట్టుబడి ఉంది," అని తెలిపారు. అలాగే రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ, "విద్యార్థుల వసతి మరియు భద్రత విషయాల్లో ఎలాంటి రాజీ ఉండదు. సమస్యను తక్షణమే పరిష్కరించడంలో సంబంధిత విభాగాలు సమయోచితంగా స్పందించడం అభినందనీయం. హాస్టల్ సదుపాయాల మెరుగుదలకు పరిపాలన వ్యవస్థ నిరంతరం కృషి చేస్తుంది," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ విభాగ అధికారులు, సాంకేతిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం వేగవంతమైన స్పందనకు హాస్టల్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం : జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్


## - ములకలపల్లి మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన





**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** సమీకృత వ్యవసాయం ద్వారా రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన ములకలపల్లి మండలంలోని పలు గ్రామాలను విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా రాజుపేట గ్రామంలో చింతకాయల నాగేశ్వర రావు, కుమారి దంపతులు నిర్వహిస్తున్న కౌజు పిట్టల యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. మండల సమైఖ్య సహాయంతో రుణం పొందిన రైతు, కౌజు పిట్టలతో పాటు నాటు కోళ్లు మరియు మేకల పెంపకం చేపడుతున్నట్టు కలెక్టర్‌కు వివరించారు. రైతు తెలిపిన ప్రకారం, 300 కౌజు పిట్టల పెంపకం చేపట్టామని ఇప్పుడు పంట చేతికి వచ్చిందని దీని ద్వారా నెలకు సుమారు 15,000 ఆదాయం పొందుతామని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న సంవత్సరం లో జిల్లాలో 500 చేపల పెంపక యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, చేపల పెంపకంతోపాటు అదే ప్రాంగణంలో కౌజు పిట్టలు, నాటు కోళ్లు, మేకల పెంపకం వంటి సమీకృత వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా చేపల పంట చేతికి వచ్చేంతవరకు రైతులు నెలవారీ ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ ఆదాయాన్ని రైతులు చేపల పెంపకానికి తీసుకున్న రుణాలకు ఈఎంఐగా చెల్లించడం ద్వారా ఆర్థికభారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే, రైతు పామాయిల్ సాగులో అంతర్పంటగా మునగ సాగు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తదుపరి పూసగూడెం గ్రామంలోని డంపింగ్ షెడ్లో గ్రామపంచాయతీ వర్కర్లు తయారు చేస్తున్న బయోచార్ (జీవ బొగ్గు) తయారీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎండిన చెట్ల కొమ్మలు, తుమ్మ వంటి పదార్థాలను చిన్న ముక్కలుగా చేసి మంట ద్వారా బయోచార్ తయారుచేసే విధానాన్ని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విధంగా తయారైన బయోచార్‌ను గోమూత్రం మరియు గోవుపేడలో కొన్ని రోజులు నానబెట్టి ఆరబెట్టి పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు సాధ్యమవుతాయని తెలిపారు. గ్రామ పంచాయతీలు చెత్త సేకరణ సమయంలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని ఆయన ఆదేశించారు. డంపింగ్ యార్డుల్లో తయారైన కూరగాయ వ్యర్థాల కంపోస్ట్ ఎరువును కూడా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ పాతగంగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ వాటికను సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలతో ముచ్చటించి, వారికి అందిస్తున్న ఆహారం గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణవాటిక ఏర్పాటు చేసి, పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు సేంద్రియ పద్ధతిలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు ఉచితంగా అందిస్తున్నారని సిబ్బంది వివరించారు. కేంద్రంలో పెంచిన ఆరు రకాల ఆకుకూరలను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని ఆకుకూరలు ఒకేసారి కాకుండా వారానికోసారి మారుస్తూ అందుబాటులో ఉంచాలని సూచించారు. మునగ, వెలగా, చింత, ఉసిరి, కరివేపాకు వంటి మొక్కలను కూడా పెంచాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణీల కోసం ప్రత్యేకంగా పోషక వాటికలను అభివృద్ధి చేయడం ద్వారా వారికి సమృద్ధమైన పోషకాహారం అందించవచ్చని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, తాసిల్దార్ గన్యా నాయక్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు : ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్థానిక ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. సీతారాంపురం గ్రామం నుంచి ఎం.వెంకటాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పొదలను, మొక్కలను తొలగించే కార్యక్రమానికి ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు శ్రీకారం చుట్టారు. ఈ మార్గంలో మలుపులు ఎక్కువగా ఉండటం వలన, మలుపుల వద్ద ఎదురెదురు వాహనాలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎస్.ఐ కె.కిరణ్ కుమార్ నాయుడు అన్నారు. సీతారాంపురం గ్రామం ఆటో యూనియన్ వారి సహకారంతో సుమారు ఎనిమిది కిలోమీటర్లు వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలను, మొక్కలను తొలగించడం జరిగిందని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మొక్కల తొలగింపు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, ఆటో యూనియన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలీసుల బలిదానాలను మరువలేము : ఎస్సై యు.మహేష్





**గజపతినగరం/ బొండపల్లి, (రాజధాని వార్తలు):** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మండలంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై యు.మహేష్ విలేకరులకు తెలియజేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎంతో ధైర్య, సాహసాలతో మావోయిస్టుల చర్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వహించి మావోయిస్టుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయి అమరులైన ముద్దాడ గాంధీ, చిరంజీవి, షేక్ ఇస్మాయిల్, బి.శ్రీరాములు, ఎస్.సూర్యనారాయణ త్యాగాలను, అమరులైన పోలీసులను స్మరించుకొంటూ, నివాళులర్పించినట్లు ఎస్.ఐ యు.మహేష్ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్.ఐ యు.మహేష్ మాట్లాడుతూ మండల కేంద్రమైన బొండపల్లి, గొట్లాం గ్రామ కూడలిల వద్ద అమరవీరుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan